సుమతీ శతకము

SL NO 736

13697

శ్రీరస్తు.

సుమతీశతకము

టీకాతాత్పర్యసహితము

మాదేటి సన్యాసయ్య అండు సన్సు

ఆంధ్రాబుక్కుడిపో,

రాజమండ్రి.

నాల్గవ కూర్పు 2000 ప్రతులు.

రాజమహేంద్రవరమున

జగవతీప్రింటింగువర్క్సునందు,

ముద్రితము.

[కాపీరైటు రిజిష్టర్డు] 1926 [వెల 3 అణాలు

శతకములు

సుమతీశతకము టీకా తాత్పర్యము	
కుమారీశతకము	
బాలరామాయణము	డిటో
మానసబోధశతకము	డిటో
భాస్కరశతకము	డిటో
దాశరధీశతకము	డిటో
శ్రీకాళహస్తీశ్వరశతకము	డిటో
అంబరీషోపాఖ్యానము	డిటో
కుచేలోపాఖ్యానము	డిటో
డిటో ఘట్టుపద్యము	డిటో
రుక్మిణీకల్యాణము	డిటో
గజేంద్రమోక్షము	డిటో
సప్తమస్కంధము	డిటో
ఆంధ్రనైఘంటుకత్రయము	డిటో
డిటో క్యాలికో బైండు	డిటో
అమరకోశము	డిటో
డిటో క్యాలికో బైండు	డిటో
నరసింహశతకము	మూలము
దాశరధిశతకము	డిటో
వేణుగోపాలశతకము	డిటో
కృష్ణశతకము	డిటో
నారాయణశతకము	డిటో
కుమారీశతకము	డిటో
సుమతీశతకము	డిటో

మాదేటి సన్యాసయ్య, ఆంధ్రాబుక్కుడిపో,

0	3	
0	8	
0	3	0
0	4	0
0	4	0
0	4	0
0	6	0
0	4	0
0	4	0
0	6	0
0	10	0
0	10	0
1	8	0
0	14	0
1	2	0
1	0	0
1	12	0
0	2	0
0	2	0
0	2	0
0	1	0
0	1	0
0	1	0
0	1	0

రాజమండ్రి

పీఠిక.

సుమతీశతకము చాలపురాతనగ్రంథ మనియు, స్వాదుమధురపద సంఘటిత మనియు, వేఱుగ వ్రాయ నవసరము లేదు, కాని రచించినకవి యెవ్వఁడై యుండునా యను సంశయము పాఠకులకుఁ దోఁచక మానదు. శాస్త్రప్రతి గ్రంథములలో భీమన యనుకవి రచించినట్లు గానఁబడుచున్నది, అభీమన్న వేదలువాడభీమకవియా వేములవాడ భీమకవియా యని పరిశోధకు లనేకులు శ్రమించుచున్నారు. ఇట్లుండ నేమి రా॥ శ్రీ॥ మానవల్లి రామకృష్ణయ్యకవిగారు భద్రభూపాలప్రణీత మగు నీతిశాస్త్రముక్తావళి యను గ్రంథమును 1930 సం॥ మున ముద్రించి ప్రకటించునపుడు దానికో కపీఠికవ్రాసి, దానిలో సుమతీశతకము రచించినకవి భద్రభూపాలుఁడనియు నీతిశాస్త్రముక్తావళిలోఁ దాను సుమతీశతకమును రచించినట్లు చెప్పుకొనుటయె రచించెననుటకాధారమని సూచించినారు. భద్రభూపాలుఁడే సుమతీశతకమును రచించినయెడల నిది క్రీ. శ. ౧౨౭౦ ప్రాంతమున రచించెనని యూహింపవచ్చును. ఈశతకముశైలియు నాకాలపుశైలిని పోలి యున్నది. నీతిశాస్త్రముక్తావళిలో నీశతకమునుదూర్చి బద్దెన యను నామాంతరము గలభద్రభూపాలుఁడు రచించినపద్దె మిందుఁ బొందుపరచినాము, కావున పాఠకులు పరిశీలింతురుగాక.

" శ. శ్రీవిభుఁడ గర్వితారి
క్ష్మాపదళనోపలబ్ధజయలక్ష్మీశ
భూవిభుఁడ సుమతిశతకము
గావించిన ప్రోడఁ గావ్యకమలాసనుఁడన్. "

అని నీతిశాస్త్రముక్తావళి యను గ్రంథమున గలదు. ఈకవికి రాజరాజ మనోజుఁ డనియు, సన్నుతగంధవారణుఁ డనియు, నుదారవైరోచనుఁడనియు, దశదిశాభరణాంకుఁ డనియు, నరేంద్రచతురాననుఁ డనియు రాజార్హంబు లగుచిహ్నంబులును, కవిబ్రహ్మ యనుకవిత్వబిరుదమును గలవు. కవి నీతిశాస్త్రముక్తావళిలో ననేకపద్యాంతములఁ దనబిరుదముల

టీ. సుమతీ, అక్కఱకున్=అవశ్యమైన కార్యమునకు, రానిచుట్టము=రానట్టిబంధువును, మ్రొక్కినన్=నమస్కరించినను, వరము=కోరికను, ఈని=ఇయ్యని, వేల్పున్=దేవునిని, మోహరమునన్=యుద్ధమునందు, తాన్=తాను, ఎక్కినన్=ఎక్కఁగా, పాఱనిగుఱ్ఱమున్—పాఱని=పఱుగెత్తని, గుఱ్ఱమున్=గుఱ్ఱమును, గ్రక్కునన్=శీఘ్రముగా, విడువంగ వలయుఁగదరా=విడిచిపెట్టవలయును గదా.

తా. తనకు సహాయము కావలసినసమయమందు సాయమునకు రాని చుట్టమును, వేఁడికొన్నను వరము నియ్యనిదేవునిని, యుద్ధమునందు ఎక్కి స్వారి చేయఁగా పఱుగెత్తని గుఱ్ఱమును, తోడనే విడువవలయును.

క. అడిగిన జీతం బియ్యని
మిడిమేలపుదొరను గొల్చి • మిడుకుటకంటెన్
వడి గలయెద్దులఁ గట్టుక
మడిదున్నుక బ్రతుకవచ్చు • మహిలో సుమతీ. 3

టీ. సుమతీ, అడిగినన్ = అడిగినప్పటికిని, జీతంబు=జీతమును, ఇయ్యని ...కోరినను ఇయ్యని=ఇయ్యనట్టి, మిడిమేలపు దొరను=మిడిమేలపు ప్రభువును, కొల్చి=సేవించి, మిడుకుటకంటెన్=కష్టముతో బ్రతుకుటకంటెను, మహిలోన్=భూమియందు, వడి=బలము, గల ఎద్దులన్=గిత్తలను, కట్టుక=కట్టుకొని, (1 ఇచ్చట కట్టుక, ప్రయోగము అసాధువు) మడిన్=పొలమును, దున్నక=దున్ని (2 ఇచ్చటను అసాధువే) బ్రతుకవచ్చున్=జీవింపవచ్చును.

తా. అడిగినప్పటికిని జీతము నియ్యని ప్రభువును గొలుచుటకంటెను మన్నును దున్ని జీవించుటయే మేలు.

క. అడియాసకొలువుఁ గొలువకు
గుడిమణియము సేయఁ బోకు • కుజనులతోడన్

విడువక కూరిమి సేయకు
మడవిని దోడరయకొంటి ♦ యరుగకు సుమతీ. 4

టీ. సుమతీ, అడియాసకొలువు-అడియాస=వ్యర్థమైన యాసగల-నిరర్థకమైన, కొలువుఁ=కొలువును-సేవావృత్తిని, కొలువకు=చేయకుము, గుడిమణియము=దేవాలయమునందలి అధికారమును, చేయఁ=చేయుటకు పోకు=పోకుము, కుజనులతోడఁ=దుర్జనులతోడ, విడువక-ఎడతెగక, కూరిమి=స్నేహము, చేయకుము, అడవినిఁ=అడవియందు, తోడు=సాహాయ్యమును, అరయక=విచారింపక-పెట్టుకొనక, ఒంటి=ఒంటరిగా, అరుగకు=పోకుము.

తా. నిరర్థకముగాఁ గొలుచుకొలువును, దేవాలయములోఁ జేయు మణియమును, దుర్జనులతో స్నేహమును, అడవిలో తోడులేక నడచుటయుఁ దగినవికావు.

క. అధరము గదలియుఁ గదలక
మధురము లగుభాషలుడిగి ♦ మానవ్రతుఁడౌ
నధికారరోగపూరిత
బధిరాంధకశవముఁ జూడఁ ♦ బాపము సుమతీ. 5

టీ. సుమతీ, అధరము=పెదవి, కదలియుఁ=అదిరియు, కదలక=అదరక, మధురము=తియ్యనివి, అగు, భాషలు=మాటలను, ఉడిగి=విడిచి, మానవ్రతుఁడు-మాన=మాటాడకుండుటయే, వ్రతుఁడు=వ్రతముగాఁగలవాఁడు ఔ...శవముఁ ఔ=అగునట్టి, అధికార=అధికారమనెడు రోగ-రోగముచేత, పూరిత=నిండినవాఁడును, (కావున) బధిర=చెవిటివాఁడును, అంధక=గ్రుడ్డివాఁడును, అగు, శవముఁ=పీనుఁగును-పీనుఁగునకు సాటియగు వానిని అనుట, చూడఁ=చూచుట, పాపము=దోషము.

తా. అధికారముచే గర్వించియున్న వానికి కన్నులుగానవు; చెవులువినవు, వాఁడు, పెదవిగదల్పఁడు కదల్చినను ఇంపుగా మాటలాడఁడు. కాఁబట్టి అట్టివాఁడు, కన్నులు తెలియక, చెవులు వినక, పెదవిగదల్పక, మాటాడ నేరక యుండుటచే సన్నిపాతరోగికి సమానమే యగును. అట్టి వానిని కస్తూరిమాత్రమైనను బాపదు.

క. అప్పుగొని చేయువిభవము
ముప్పునఁ బ్రాయంపుటాలు ♦ మూర్ఖుని తపమున్
దప్పరయని నృపు రాజ్యము
దెప్పరమై మీఁదఁ గీడు ♦ దెచ్చుర సుమతీ. 6

టీ. సుమతీ, అప్పు=ఋణమును, కొని=తీసికొని, చేయువిభవము=చేయునట్టి వేడుకయును, ముప్పునన్=ముసలితనమందు, ప్రాయంపు ఆలు=పడుచు పెండ్లమును. మూర్ఖుని తపమున్- మూర్ఖుని=చదువులేని వాని యొక్క-మూర్ఖుని యొక్క, తపమున్=తపస్సును, తప్పు=నేరమును, అరయని...రాజ్యము-అరయని=విచారించని, నృప=రాజుయొక్క, రాజ్యమున్=దొరతనమును, దెప్పరమై=సహింపశక్యము కానిదై, మీఁదన్=పిమ్మట, కీడు=చెడుగు, తెచ్చున్=కలిగించును సుమా.

తా. అప్పుచేసి చేయువేడుకయును, ముసలితనమందు పడుచుపెండ్లమును, తప్పును కనుగొనలేని ప్రభుత్వమును, అప్పటికి సహింపశక్యము కాకుండుటయే కాక పిదపను కీడు కలిగించును.

క. అప్పిచ్చువాఁడు వైద్యుఁడు
నెప్పుడు నెడతెగక పాఱు ♦ నేఱును ద్విజుఁడున్
జొప్పడిన యూర నుండుము
చొప్పడకున్నట్టి యూరు ♦ సొరకుము సుమతీ 7

టీ. సుమతీ, అప్పు=ఋణమును - ఇచ్చువాఁడు - వైద్యుఁడు=వైద్యుఁడును - ఎప్పుడున్=ఎల్లప్పుడును - ఎడతెగక=నడుమవిడువక, పారునేఱును - పారు=ప్రవహించుచున్న, ఏఱును=నదియును - ద్విజుఁడున్=బ్రాహ్మణుఁడును - చొప్పడినయూరన్ - చొప్పడిన=ఏర్పడియున్నట్టి - ఊరన్=ఊరియందు - ఉండుము - చొప్పడక=అవియేర్పడక - ఉన్నట్టియూరున్=ఉండనట్టియూరిని - చొరకుము=ప్రవేశింపకుము.

తా. అప్పిచ్చువాఁడును - వైద్యుఁడును - ఎడతెగక జలము పాఱుచుండెడి నదియును - బ్రాహ్మణుఁడును లేనియూరను ప్రవేశింపనుగూడ-దగదు.

క. అల్లునిమంచితనంబును
గొల్లని సాహిత్యవిద్య ♦ కోమలినిజమున్
బొల్లున దంచినబియ్యముఁ
దెల్లనికాకులును లేవు ♦ తెలియుర సుమతీ. 8

టీ. సుమతీ - అల్లునిమంచితనంబును=అల్లుఁడు మంచివాఁడుగా నుండుట - గొల్లనిసాహిత్యవిద్య - గొల్లని=గొల్లవానియొక్క - సాహిత్యవిద్య=భాషయందలి పదపదార్థముల విశేషజ్ఞానమును - కోమలినిజమున్=ఆఁడుదానియొక్క యదార్థమును అనఁగా నిజముచెప్పుటయును - పొల్లునన్=పొల్లుపట్టినధాన్యమునందు - దంచినబియ్యము=దంచఁగాఁ గలిగినబియ్యమును - పొల్లును దంచియొత్తినబియ్యమనుట - తెల్లనికాకులును - లేవు=కలుగవు - తెలియుర=తెలిసికొనుము.

తా. మంచితనముగల యల్లుఁడును - విద్వాంసుఁడైన గొల్లవాఁడును - నిజము పలుకు స్త్రీయు - పొల్లున దంచితీసిన బియ్యమును - తెల్లని కాకులు లోకములో లేవు.

క. ఆఁకొన్న కూడె యమృతము
తాఁకొందక నిచ్చువాఁడె ♦ దాత ధరిత్రిన్
సోఁకోర్చువాఁడె మనుజుఁడు
తేఁకువ గలవాఁడె వంశ ♦ తిలకుఁడు సుమతీ. 9

టీ. సుమతీ-ఆఁకొన్న కూడె=ఆఁకలిగొనినపుడు తిన్న యన్నమే, అమృతము=అమృతమువంటిది. తాఁకు=ఆటంకము - ఒందక=చెందక ఇచ్చువాఁడె=ఇచ్చునట్టివాఁడే - దాత=దాతయగువాఁడు - ధరిత్రిన్=భూమియందు - సోఁకు=శ్రమమును - ఓర్చువాఁడె=సహించువాఁడె - మనుజుఁడు=మనుష్యుఁడు - మనుష్యుఁడని చెప్పఁదగినవాఁడు - తేఁకువ=ధైర్యము - కలవాఁడె=కలిగినవాఁడే - వంశతిలకుఁడు=కులమునకు అలంకారమైనవాఁడు - కులశ్రేష్ఠుఁడనుట.

తా. ఆఁకలిగా నున్నప్పుడు తిన్న యన్నమే యమృతమువలె భోగ్యముగా నుండును. అడిగినపుడు, ఆటంకము లేక యిచ్చుటయే దాతలక్షణము, కష్టములకు ఓర్చుకొనువాఁడె పురుషుఁడనందగును. ధైర్యము కల వాఁడే తనవంశమునకు కీర్తి తెచ్చును.

క. ఆకలియుడుగనికుడుపును
వేఁకటి యగులంజపడుపు ♦ విడువనిబ్రతుకున్
బ్రాఁకొన్న నూతియుదకము
మేఁకలపాడియు రోఁత ♦ మేదిని సుమతీ. 10

టీ. సుమతీ-ఆఁకలి-ఉడుగని కుడుపును-ఉడుగని=మానని-కుడుపు=తిండియును-ఆఁకలితీరనట్టి భోజనమనుట - వేఁకటి=గర్భముగ అది - అగు - లంజె=ఉంపుడుకత్తెయొక్క-పడుపు=సంపాదన-విడువని బ్రతుకున్=వదలిపెట్టని జీవనమును- గర్భము కలిగి యున్న[illegible] సం

సాధించు బ్రతుకనుట-ప్రాకొన్న...దకము, ప్రాకొన్న=పాచిపడినట్టి బహుకాలము వాడఁబడకుండునట్టి-నూతి=బావియొక్క-ఉదకము=నీళ్ళు-మేఁకలపాడియున్-మేదినిన్=భూమియందు-రోఁత-అసహ్యమైనవి

తా. ఆఁకలి తీఱని భోజనమును - లంజ గర్భము కలిగియున్నను అర్జనము సేయుటయు-ప్రాఁతదైన బావినీళ్ళును - మేఁకలపాడియును రోఁతఁ బుట్టించునవి.

క. ఇచ్చునదె విద్య రణమునఁ
జొచ్చునదె మగతనంబు ♦ సుకవీశ్వరులున్
మెచ్చునదె నేర్పు వాదుకు
వచ్చునదే గీడు సుమ్ము ♦ వసుధను సుమతీ. 11

టీ. సుమతీ-వసుధను=భూమియందు - ఇచ్చునదె=ధనము ఇచ్చునట్టిదే - విద్య=విద్యయగును - రణమునన్=యుద్ధమునందు-చొచ్చునదె=చొరబడునట్టిదే-మగతనంబు=పౌరుషము-సుకవీశ్వరులున్=మంచి కవిశ్రేష్ఠులుగూడ-మెచ్చునదె=మెచ్చునట్టిదే-నేర్పు=సామర్థ్యము-వాదుకు=వివాదమునకు - తగవునకు-వచ్చునదే=వచ్చునట్టిదే - కీడు - చెఱుపు సుమ్ము=సుమా.

తా. ద్రవ్యమును ఆర్జింపఁజేయునదియే విద్య. యుద్ధమందుఁ జొచ్చుటయే మగతనము. సుకవీశ్వరులును మెచ్చునట్టిదే సామర్థ్యము. తగవునకు వచ్చుటయే చెఱుపు.

క. ఇమ్ముగఁ జదువని నోరును
నమ్మా యని పిలిచి యన్న ♦ మడుగని నోరున్
దమ్ములఁ బిలువని నోరును
గుమ్మరి మను ద్రవ్వినట్టి ♦ గుంటర సుమతీ. 12

టీ. సుమతీ - ఇమ్ముగన్ = చక్కగా - చదువనినోరును = చదువనట్టినోరును - అమ్మా = ఓ అమ్మా - అని - పిలిచి - అన్నము = అన్నమును - అడుగని నోరును = అడుగనట్టినోరును - తమ్ములన్ = సోదరులను - పిలువనినోరును = పిలువనట్టినోరును - కుమ్మరి = కుమ్మరివాఁడు - మను = మన్నును - త్రవ్వినట్టి గుంటర = త్రవ్వినట్టి గొయ్యియగును - అపల్లముతో సాటియైన దనుట.

తా. చక్కఁగా చదువనినోరును. అమ్మా! యని పిలిచి యన్నమడుగనివారినోరును, తమ్ముఁడా! యని పిలువనినోరును, కుమ్మరివాఁడు మట్టిత్రవ్వి విడిచినగుంటను బోలును. అనఁగా నాగుంటవలె నిరర్థకమని భావము.

క. ఉడుముండదె నూఱేండ్లును
బడియుండదె పేర్మిఁ బాము ♦ పదినూఱేండ్లున్
మడువునఁ గొక్కెర యుండదె
కడునిలఁ బురుషార్థపరుఁడు ♦ గావలె సుమతీ. 13

టీ. సుమతీ. ఉడుము, నూఱేండ్లును = నూఱుసంవత్సరములును, ఉండదె = ఉండదా - బ్రతుకదాయనుట, పాము, పేర్మిన్ = అతిశయముతో, పది నూఱేండ్లున్ = వేయేండ్లును, పడియుండదె = ఉపయోగము లేక పడియుండదా, మడువునన్ = మడువునందు, కొక్కెర = కొంగ, ఉండదె = అన్నియేండ్లుండదా, ఇలన్ = భూమియందు, కడున్ = మిక్కిలి, పురుషార్థపరుఁడు = మంచిపనులయందు ఆసక్తిగలవాఁడు, కావలెన్ = కావలయును.

తా. ఉడుము నూఱేండ్లు ఉండును. పాము వేయేఁడ్లు ఉండును. కొంగయు మడుగునందు బహుకాలము ఉండును, ఏండ్లు పూండ్లుగా ఉండినంతనే పసయేమి, పురుషార్థములను సాధించుటచేతనే ప్రయోజనము.

క. ఉత్తమగుణములు నీచున
కెత్తెఱగున గలుగనేర్చు ♦ నెయ్యెడలందా

నెత్తిచ్చి కరఁగి పోసిన
నిత్తడి బంగార మగునె ♦ యిలలో సుమతీ. 14

టీ. సుమతీ, నీచునకున్=అల్పునకు, ఉత్తమగుణములు=మంచిగుణములు, ఎత్తెఱంగునన్=ఏరీతిగా, కలుగనేర్చున్=కలుగఁజాలును, ఎయ్యెడలన్=ఏచోటనైనను, తాన్=తాను, ఎత్తు=సరియెత్తు ఇచ్చి, కరఁగి=కరఁగించి, పోసినన్=పోయఁగా, ఇత్తడి=ఇత్తడియనులోహము, బంగారము=బంగారు, అగునె=అగునా.

తా. బంగారము సరియెత్తు ఇత్తడికిచ్చి కరఁగిపోసినను బంగారము కానేరదు, అట్లే నీచుఁడైనవానికి ఏమిచేసినను మంచిగుణములు కలుగవు.

క. ఉదకము ద్రావెడుహయమును
మదమున నుప్పొంగుచుండు ♦ మత్తేభంబున్
మొదవుకడనున్న వృషభముఁ
జదువని యానీచుకడకుఁ ♦ జనకుర సుమతీ. 15

టీ. సుమతీ, ఉదకము=నీటిని, ద్రావెడుహయమును=త్రాగునట్టిగుఱ్ఱమును గుఱించియును, మదమునన్=మదముచేత, ఉప్పొంగుచుండు మత్తేభంబున్=అతిశయించుచున్న మదపుటేనుఁగును గుఱించియును, మొదవుకడన్=ఆవుదగ్గఱ, ఉన్నవృషభమున్=ఉన్నట్టి యెద్దును గుఱించియును, చదువని యానీచుకడకున్=చదువనట్టి నీచుదగ్గఱకును, చనకుర=పోకుము.

తా. నీరుత్రాగుచున్న గుఱ్ఱమునొద్దకును, మదము మిక్కిలి పట్టియున్న యేనుఁగునొద్దకును, ఆవునంటియున్న యెద్దుదగ్గఱకును, చదువులేని యల్పుని యొద్దకును పోరాదు

క. ఉపకారికి నుపకారము
విపరీతముగాదు సేయ ♦ వివరింపంగా

నపకారికి నుపకారము
నెపమెన్నక సేయువాడు ♦ నేర్పరి సుమతీ. 16

టీ. సుమతీ, ఉపకారికిన్ = మేలు చేసినవానికి, ఉపకారము = ప్రత్యుపకారమును, చేయన్ = చేయుట, విపరీతము = వ్యత్యస్తము కాదు = కా నేరదు. వివరింపఁగా = విచారింపఁగా, అపకారికిన్ = చెఱుపు చేసినవానికి, నెపము = సాకును, ఎన్నక = ఎంచక, ఉపకారము = మేలును, చేయువాఁడు, నేర్పరి = నేర్పుకలవాఁడు.

తా. మేలు చేసినవానికి బదులు మేలుచేయుట యొకవిచిత్రము కాదు. కీడుచేసినవానికి వానిచెఱుపు తలంపక మేలు చేయుటయే నేర్పరితనము.

క. ఉపమింప మొదలు తియ్యన
కపటం బెడనెడను జెఱకు ♦ కైవడి నేపో
నెపములు వెదకును గడపటఁ
గపటపుదుర్జాతిపొందు ♦ గదరా సుమతీ. 17

టీ. సుమతీ. కపటపుదుర్జాతిపొందు = కపటము గలదుర్జనుని స్నేహము, ఉపమింపన్ = పోల్చిచూడఁగా, చెఱకుకైవడి నేపో = చెఱకువిధముననే సుమా, మొదలు = ఆరంభము, తియ్యన = తీఁపుకలది, ఎడనెడన్ = నడుమనడుమ, కపటంబు = వంకరగనుండి-వరించనగలది. కడపటన్ = చివరకు, నెపములు = తప్పులను, వెదకునుగదరా = వెదకునుగదా.

తా. చెఱకు మొదలమొదల తియ్యగానుండి, మీఁద నడుమ నడుమ తీపిలేక తుదకుఁ జప్పిడియైపోవును. అట్లే దుర్జనునితోఁ జేసిన స్నేహము మొదట నింపుగాను వెనుక నప్పుడప్పుడు గడుసుగాను నుండి కడపట చెఱుపు గలిగించును.

క. ఎప్పటి కెయ్యది ప్రస్తుత
మప్పటికా మాటలాడి ♦ యన్యులమనముల్
నొప్పింపక తా నొవ్వక
తప్పించుక తిరుగువాఁడు ♦ ధన్యుఁడు సుమతీ 18

టీ. సుమతీ, ఎప్పటికి=ఏసమయమునకు, ఎయ్యది=ఏది, ప్రస్తుతము=చెప్పఁదగినదో, అప్పటికిన్=ఆసమయమునకు, ఆమాటలు=చెప్పఁదగిన మాటలు, ఆడి=చెప్పి, అన్యులమనముల్=ఒరుల మనస్సులు, నొప్పింపక=నొచ్చునట్లుచేయక, తాన్=తాను, నొవ్వక=నొచ్చుపోక, తప్పించుక=తప్పించుకొని, తిరుగువాఁడు=సంచరించువాఁడు, ధన్యుఁడు=కృతార్థుఁడు.

తా. ఏసమయమున ఏది చెప్పదగునో అప్పటికి అమ్మాటలే చెప్పి, ఒకరిని నొప్పింపక, తాను నొవ్వక, తప్పించుకొని సంచరించువాఁడే ధన్యుఁడు.

క. ఎప్పుడు దప్పులు వెదకెడు
నప్పురుషునిఁ గొల్వఁగూడ ♦ దదియెట్లన్నన్
సర్పంబు పడగనీడను
గప్ప వసించినవిధంబు ♦ గదరా సుమతి. 19

టీ. సుమతీ, ఎప్పుడున్=ఎల్లప్పుడును, తప్పులు=దోషములను, వెదకెడున్=వెదకునట్టి, అప్పురుషుని=ఆపురుషుని, కొల్వన్=సేవించుట, కూడదు=తగదు. అది=ఆసేవించుట, ఎట్లు=ఏవిధము, అన్నన్=అనఁగా, సర్పంబు పడగనీడను- సర్పంబు=పాముయొక్క, పడగ=పడగయొక్క, నీడను=నీడయందు, కప్ప=మండూకము, వసించినవిధంబు=నివసించినరీతి, కదరా=కదా.

తా. ఎల్లప్పుడుం దప్పులు వెదకుపురుషుని చెంత నుండుట తప్పు తన్ను జంపు పాముపడగనీడ నుండుటవంటిది. అనఁగా తనకు హానికలుగును.

క. ఎప్పుడు సంపద గలిగిన
నప్పుడు బంధువులు వత్తు ♦ రది యెట్లన్నన్
దెప్పలుగ జెఱువు నిండిన
గప్పలు పదివేలు చేరుఁ ♦ గదరా సుమతీ 20

టీ. సుమతీ - ఎప్పుడు=ఏసమయమునందు - సంపద=ఐశ్వర్యము-కలిగిన=ఉండిన - అప్పుడు=అసమయమునందే - బంధువులు=చుట్టములు-వత్తురు - అది=అవచ్చుట-ఎట్లు=ఏవిధము-అన్నన్=అనఁగా-తెప్పలుగన్=తెప్పదేలునట్లు-చెఱువు=తటాకము - నిండినన్=నిండియున్న-కప్పలు=మండూకములు-పదివేలు=అనేకములు - చేరును+కద రా=చేరునుగదా.

తా. చెఱువు పూర్ణముగా నిండియున్నప్పుడు పిలువకుండ కప్పలు అనేకములు చేరునట్లు ఐశ్వర్యము కలిగినప్పుడు బంధువులు తామే చేర వత్తురు. సంపద లేనిరోజుల చుట్టములు రారని భావము.

క. ఏఱకుమీ కసుగాయలు
దూఱకుమీ బంధుజనుల ♦ దోషము సుమ్మీ
పాఱకుమీ రణమందున
మీఱకుమీ గురువులాజ్ఞ ♦ మేదిని సుమతీ. 21

టీ. సుమతీ, కసుగాయలు=పచ్చికాయలను, ఏఱకుమీ=ఏర్చికొనకుము-బంధుజనులన్=చుట్టములను-దూఱకుమీ=నిందింపకుము, దోషము సుమ్మీ=దోషము సుమా - రణమందునన్=యుద్ధమునందు - పాఱకుమీ=పరుగెత్తకుము-మేదినిన్=భూమియందు - గురువులాజ్ఞ=గురువులయొక్క ఆజ్ఞను-మీఱకుమీ=అతిక్రమింపకుము.

తా. పచ్చికాయలను గోయరాదు-చుట్టములను నిందింపరాదు యుద్ధమునందు ఓడి పారిపోరాదు. గురుల యాజ్ఞను అతిక్రమింపరాదు.

క. ఒకయూరికి నొకకరణము
నొకతీర్పరి యైనఁ గాక ♦ నొగిఁ దఱుచైనం
గకవికలు గాకయుండునె
సకలంబును గొట్టువడక ♦ సహజము సుమతీ 22

టీ. సుమతీ ఒకయూరికిన్=ఒకగ్రామమునకు-ఒకకరణమును=ఒకకార్యసాధకుఁడును - ఒకతీర్పరి=ఒకన్యాయాధిపతియును-ఒగిన్=క్రమముగా ఐనఁగాకన్=అయినయెడలనే కాని - తఱుచు= అధికము-ఐనన్=అయినయెడల - సకలంబును=అన్నియును - గొట్టువడక=చెడిపోక - కకవికలు=నానావిధములు - కాక=కాకుండక - ఉండునె=ఉండునా.

తా. ఒకయూరికి ఒక్క కరణము ఒక్క న్యాయాధిపతియునే యుండవలయును. కాని యనేకులు ఉండినయెడల అందరి క్రమములన్నియును దప్పి నానావిధములగు కలఁతలు పుట్టును.

క. ఒల్లనిసతి నొల్లనిపతి
నొల్లనిచెలికాని విడువ ♦ నొల్లనివాఁడే
గొల్లండు గాక ధరలో
గొల్లండును గొల్లఁడౌనె ♦ గుణమున సుమతీ. 23

టీ. సుమతీ, ఒల్లనిసతిన్=ఇష్టపడనిభార్యను-ఒల్లనిపతిన్=ఇష్టపడని యజమానుని-ఒల్లనిచెలికాని=ఇష్టపడని స్నేహితుని-విడువన్=విడుచుటకు - ఒల్లనివాఁడే=ఇష్టపడనివాఁడే- గొల్లండు=గొల్లవాఁడు-కాక=కాని-ధరలోన్=భూమియందు - గొల్లండును=గొల్లవాఁడును,

గుణమువన్=గుణముచేత - గొల్లండు=గొల్లవాఁడు - ఔగా=అగునా? కాఁడనుట.

తా. తన్నుఁబల్లనిభార్యను, ప్రేమింపని యజమానుని, ఇష్టపడని స్నేహితుని విడిచిపెట్టుటకు ఇష్టపడనివాఁడే గొల్లవాఁడు గాని జాతిచే గొల్లయైనవాఁడు గొల్లవాఁడు కాఁడు. అనఁగా మూర్ఖుఁడు—అనియు నర్థము.

క. ఓడలు బండ్లును వచ్చును
ఓడలు నాబండ్లమీఁద ♦ నొప్పుగవచ్చున్
ఓడలు బండ్లునువలెనే
వాడంబడుఁ గలిమి లేమి ♦ వసుధను సుమతీ. 24

టీ. సుమతీ, ఓడలన్=ఓడలయందు, బండ్లును, వచ్చును, ఓడలు ను=నావలును, బండ్లమీఁదన్=బండ్లయందు, ఒప్పుగన్=చక్కఁగా వచ్చున్=వచ్చును-ఓడలు=నావలును, బండ్లునువలెనే=శకటములువలె నే, వసుధను=భూమియందు, కలిమి=సంపదయు, లేమి=దారిద్ర్యము, వాడంబడును=వాడఁబడును.

తా. ఓడలమీఁద బండ్లును, బండ్లమీఁద ఓడలును వచ్చునట్లే ఐశ్వర్యమువెంట దారిద్ర్యమును, దారిద్ర్యమువెంట ఐశ్వర్యమును వచ్చుచుండును.

క. కడు బలవంతుడైనను
బుడమిని బ్రాయంపుటాలిఁ ♦ బుట్టినయింటం
దడ వుండ నిచ్చెనేనియుఁ
బడుపుఁగ నంగడికిఁ దానె ♦ పంపుట సుమతీ. 25

టీ. సుమతీ, పుడమిన్ = భూమియందు, కడున్ = మిక్కిలి, బలవంతుండు = బలముకలవాఁడు, ఐనను = అయినప్పటికిని, ప్రాయంపుటాలిన్ = పడుచుపెండ్లామును, పుట్టినయింటన్ = పుట్టినయింటియందు తడవు = చిరకాలము, ఉండనిచ్చెనేనిన్ = ఉండనిచ్చినయెడల, పడుపుగన్ = పడుపువనకు, అంగడికిన్ = బజారునకు, తానేపంపుట = పొమ్మనిచెప్పుట.

తా. ఎంతబలము గలవాఁడయినను, ప్రాయము గల తన పెండ్లామును పుట్టినింటనే చిరకాలము ఉండనిచ్చినయెడల దానిప్రవర్తనమును తానే చెఱిపిన వాఁడగును.

క. కనకపు సింహాసనమున
శునకముఁగూర్చుండఁ బెట్టి ♦ శుభలగ్నమునం
దొనరఁగ బట్టము గట్టిన
వెనుకటిగుణ మేలమాను ♦ వినురా సుమతీ. 26

టీ. సుమతీ, కనకపుసింహాసనమునన్ = బంగారుగద్దియయందు, శునకమున్ = కుక్కను, కూర్చుండఁబెట్టి = కూర్చుండునట్లుచేసి, శుభలగ్నమునన్ = మంచిలగ్నమునందు, ఒనరగన్ = ఒప్పునట్లుగా, పట్టమున్ = బంగారపు పట్టరేకును, కట్టినన్ = కట్టినప్పటికిని, పట్టాభిషేకము చేసినను అనుట, వెనుకటిగుణము = మునుపటిగుణమును, ఏల = ఎందుకు, మానున్ = విడిచిపెట్టును, వినురా = వినుము.

తా. మంచిలగ్నమునందు కుక్కను సింహాసనమున బట్టాభిషేకము చేసి కూర్చుండఁబెట్టినను, దానికి సహజమయిన యల్పగుణమును మానని యట్లే నీచుఁడయిన వానిని ఎంత గౌరవించినను నీచగుణమును వదలఁడు.

క. కప్పకు నొరగాలైనను
సర్పమునకు రోగమైన ♦ సతి తులువైనన్
ముప్పున దరిద్రుడైనను
దప్పదు మఱి దుఃఖ మగుట ♦ తథ్యము సుమతీ. 27

టీ. సుమతీ, కప్పకున్, ఒరగాలు=కుంటికాలు, ఐనను=అయినను, సర్పమునకున్=పామునకు, రోగము=వ్యాధి, ఆయినన్=అయినప్పటికిని, సతి=పతివ్రతయైనయిల్లాలు, తులువ=దుర్మార్గురాలు, ఐనన్=అయినను, ముప్పునన్=ముసలితనమునందు, దరిద్రుఁడు=అభాగ్యుఁడు, ఐనన్=అయినప్పటికిని, మఱి=అధికముగా, దుఃఖము=వ్యసనము, అగుట=కలుగుట. తప్పదు=తప్పఁబోదు, తథ్యము=నిజము.

తా. కాలు కుంటియయిన కప్పయును, వ్యాధినొందిన పామును, గయ్యాళియైన పెండ్లమును, ముసలితనమున దారిద్ర్యము నొందినవాఁడును, తప్పక దుఃఖము నొందుదురు.

క. కమలములు నీఁటి బాసిన
గమలాప్తుని రశ్మిసోఁకి ♦ కమలినభంగిం
దమతమ నెలవులు దప్పినఁ
దమమిత్రులు శత్రులౌట ♦ తథ్యము సుమతీ. 28

టీ. సుమతీ, కమలములు=తామరలు, నీటన్=జలమును, పాసి నన్=విడిచినయెడల, కమలాప్తునిరశ్మి=సూర్యకిరణము, సోఁకి=తగిలి, కమలినభంగిన్=వాడిపోయినవిధముగా, తమతమ నెలవులు=తమతమ నికిపట్టులు, తప్పినన్=విడిచిపెట్టినయెడల, తమమిత్రులు=తమస్నేహితులు, శత్రులు=విరోధులు, ఔట=అగుట, తథ్యము=నిజము.

తా. తామరపువ్వులు తమస్థానమగునీటిని వదలినయెడల తమకుల

త్రుఁడయిన సూర్యకిరణముల చేతనే వాడిపోవునట్లు, ఎవరుగాని తమతమ నెలవులు తప్పినయెడల వారి స్నేహితులు కూడ వారికి విరోధులగుట నిజము.

క. కరణము గరణము నమ్మిన
మరణాంతక మౌనుగాని ♦ మనలేదు సుమీ
కరణము దనసరికరణము
మఱి నమ్మక మర్మమీక ♦ మనవలె సుమతీ 29

టీ. సుమతీ, కరణము=గ్రామపు లెక్కలను వ్రాయువాఁడు, కరణము మఱొక లెక్కలు వ్రాయువానిని, నమ్మినన్=నమ్మినయెడల, మరణాంతకము=ప్రాణాపాయమయిన ఆపద, ఔనుగాని=అగునుకాని, మనలేదుసుమీ=బ్రతుకలేఁడుసుమా. కరణము=లెక్కలువ్రాయువాఁడు, తనసరి కరణమున్=తనతోసాటియగు లెక్కలువ్రాయువానిని, నమ్మక=విశ్వసింపక, మర్మము=రహస్యమును, ఈక=ఇయ్యక, తెలుపక, మనవలెన్=బ్రదుకవలెను.

తా. గ్రామకరణము మఱియొక కరణమును నమ్మినయెడల ప్రాణాంతకమయిన ఆపదను బొందునే కాని తప్పించుకొని బ్రతుకలేఁడు. కనుక కరణము తనవలెనే కరణమయినవానిని నమ్మక తనమర్మమును వానికి చెప్పక జీవింపవలయును.

క. కరణముల ననుసరింపక
విరసంబునఁ దిన్నతిండి ♦ వికటించుఁ జుమీ
యిరుసునఁ గందెనఁ బెట్టక
పరమేశ్వరుబండియైనఁ ♦ బాఱదు సుమతీ. 30

టీ. సుమతీ, కరణములన్=లెక్కలువ్రాయువారలను, అనుసరింపక=ఆశ్రయింపక, విరసంబునన్=విరసముచేత, వారితో అనుకూల్యములేక తిన్నతిండి=భుజించిన యన్నము, వికటించున్ సుమీ=దేహములో యిముడకపోవును సుమా, ఇరుసునన్=ఇరుసునందు, కంద

నన్ = కొలుకను, పెట్టక = ఉంపక, ఉంపనియెడల, పరమేశ్వరుబండి యయినన్ = పరమేశ్వరుని యొక్క బండియయినప్పటికిని, పోదు = పరుగిడదు.

తా. పరమేశ్వరుని బండియయినను ఇరుసులో కందెన పెట్టని యెడల పోవనియట్లె, కాఁపులు కరణము వానిని అనుసరింపనియెడల తాము సుఖముగా అనుభవింపఁజాలరు.

క. కరణము సాధై యున్నను
గరి మద ముడిగినను బాము ♦ గఱవక యున్నన్
ధరఁ దేలు మీట కున్నను
గర మరుదుగ లెక్కఁగొనరు ♦ గదరా సుమతీ 31

టీ. సుమతీ, కరణము = గ్రామపు లెక్కలు వ్రాయువాఁడు, సాధు = మెత్తదనము కలవాఁడు ఐ = అయి. ఉన్నను = ఉండినను, కరి = ఏనుగు, మదము = మదమును, ఉడిగినను = విడిచినను, పాము = సర్పము, కఱవక = కాటకక, ఉన్నన్ = ఉండినను, ధరన్ = భూమియందు, తేలు = వృశ్చికము, మీటక = కొండితో పొడువక, ఉన్నన్ = ఉండినను, కరము = మిక్కిలి, అరుదుగన్ = ఆశ్చర్యముగా, లెక్కగొనరు = లక్ష్యము చేయరు, కదరా = కదా.

తా. మెత్తదనము గల కరణమువానిని, మదములేని యేనుగును, కఱవని పామును, కుట్టని తేలును, లోకులు లక్ష్యముచేయరు.

క. కసుగాయఁ గఱచి చూచిన
మసలక దన యొగరు గాక ♦ మధురంబగునా
పస గలుగు యువతు లుండఁగఁ
బసి బాలలఁ బొందువాఁడు ♦ పశువుర సుమతీ. 32

టీ. సుమతీ, కసుగాయఁ=పచ్చికాయను, కఱచిచూచినఁ=కొఱికిచూచినఁగా మసలక=ఆలస్యములేక, తనయొగరు=తనదయినవొగరు, కాక=కానిది, మధురంబు=తియ్యనిది, అగునా=అగునా-కానేరదనుట, పని=ప్రయోజనము, గలుగు యువతులు=కలయట్టియౌవన స్త్రీలు, ఉండఁగన్=ఉండఁగా, పసిబాలలన్=మిక్కిలిపసితనముగల బాలికలను, పొందువాఁడు=అనుభవించువాఁడు. పశువుర=పశువే యగును - పశువుతో సమానుఁడు. మూఢుఁడనుట

తా. పండినపండును భక్షించినచే తియ్యఁగా నుండును గాని పచ్చికాయను కొఱికి చూచినంత వగరుగానే యుండును ఇట్లేమంచి యౌవనముగల స్త్రీలతో అనుభవించినచే సుఖముగాని పసిబాలికలతో అనుభవించుట పాటుతనమే యగును.

క. కవి గాని వాని వ్రాతయు
నవరసభావములు లేని ♦ నాతులవలపుం
దవిలి చనుపంది నేయని
వివిధాయుధ కౌశలంబు ♦ వృథరా సుమతీ. 33

టీ. సుమతీ, కవి=కవిత్వము చెప్పువాఁడు, (శుచియు సత్కులీనుఁడు సమర్థుఁడు వ్యాకరణశాస్త్రము, ఛందస్సు, జ్యోతిషము, మున్నగు శాస్త్రసాంప్రదాయముల నెఱిఁగినవాఁడు లోకజ్ఞానసంపన్నుఁడు కవి యగు నని లక్షణము,) కానివాని వ్రాతయున్=కానట్టివానియొక్క వాక్యరచనయును, నవరసభావములు=శృంగారాది నవరసములును వానిభావములు, లేని=లేనట్టి, నాతుల=స్త్రీలయొక్క, వలపున్=మోహమును, చనుపందిన్=పోవుచున్న పందిని, తవిలి=తగిలి-వెన్నంటి, ఏయని వివిధాయుధ కౌశలంబు=కొట్టని నానావిధములయిన బాణములయందలి నేర్పు, వృథరా=వ్యర్థముసుమీ.

తా. కవిగానట్టివాఁడు చేసిన రచనయు, నవరసములును వాని-భావములను ఎఱుఁగని స్త్రీలమోహమును, పరుగిడుపందిని నెన్నంటి దుముకు జాలనివాని బాణవిద్యయు నందలి నేర్పును వ్యర్థములు.

క. కాదు సుమీ దుస్సంగతి
పోదుసుమీ కీర్తికాంత ♦ పొందినపిదపన్
వాదుసుమీ యప్పిచ్చుట
లేదుసుమీ సతులవలపు ♦ లేశము సుమతీ. 34

టీ. సుమతీ, దుస్సంగతి=దుర్జనస్నేహము, కాదుసుమీ=కూడదుసుమా, కీర్తికాంత=కీర్తియనియెడుస్త్రీ - పొందినపిదపన్=పొందినపిమ్మట- పోదుసుమీ=తొలఁగిపోదుసుమా - అప్పు=ఋణమును- ఇచ్చుట-వాదుసుమీ=తగవుసుమా - సతులవలపు=స్త్రీలమోహము - లేశము=కొంచెమయినను - లేదుసుమీ=ఉండునది కాదుసుమా.

తా. దుష్టులతోడి స్నేహము తగదు. సంపాదించినకీర్తి తొలఁగి పోదు. అప్పునిచ్చుట కలహమునకు మూలము. స్త్రీల వలపు నిలుచునది కాదు.

క. కాముకుఁడు దనిసి విడిచిన
కోమలిఁ బరవిటుఁడు గవయఁ ♦ గోరుటయెల్లం
బ్రేమమునఁ జెఱకుపిప్పికిఁ
జీమలు వెస మూఁగినట్లు ♦ సిద్ధము సుమతీ. 35

టీ. సుమతీ, కాముకుఁడు=ఒకస్త్రీని కామించినవాఁడు-తనిసి=తృప్తినొంది - తృప్తికలుగునట్లుగా అనుభవించియనుట - విడిచినకోమలిన్=విడిచిపెట్టినట్టిస్త్రీని - పరవిటుఁడు=మఱియొక్క విటకాఁడు- కవయన్=పొందుటకు- కోరుటయెల్లన్=ఆశపడుటయంతయు - చెఱ

కుపిప్పికి=రసము పిడిచికొనఁగా మిగిలిన చెఱుకుయొక్క పిప్పికి ఈఁగల- ప్రేమమునన్=ప్రీతితో - మూఁగినట్లు=ముసురుకొన్నట్లు- సిద్ధము= ఇదితప్పనిది.

తా. ఒక కాముకుఁడు తాను తృప్తి గలుగునట్లుగా అనుభవించి విడిచినస్త్రీని మఱియొకవిటగాఁడు అనుభవింపఁగోరుట- చెఱకురసమును పిడిచికొనఁగా మిగిలినపిప్పికి ఈఁగలు ఆశతో ముసరికొన్నట్లు నీరసమే యగును.

క. కారణము లేని నగవును
పేరణమును లేని లేము ♦ పృథివీస్థలిలోఁ
బూరణము లేనిబూరెయు
వీరణములు లేనిపెండ్లి ♦ వృథరా సుమతీ. 36

టీ. సుమతీ, కారణము=నిమిత్తము - లేనినగవును=లేనట్టినవ్వును, పేరణమును=అవికారము - లేనిలేము=లేనియాఁడుదియును - పృథివీస్థలిలోఁ=భూమియందు - పూరణము=పప్పుబెల్లము - లేనిబూరెయు=లేనటువంటి బూరెయును - వీరణములు=వాద్యములు - లేని పెండ్లి=లేనివివాహము - వృథరా=వ్యర్థముగదా.

తా. కారణము లేనినవ్వును - రవికలేనియాఁడుదియు - పూరణము పెట్టనిబూరెయు - వాద్యములేని పెండ్లియు వ్యర్థములు.

క. కులకాంత తోడ నెప్పుడుఁ
గలహింపకు వట్టితప్పు ♦ ఘటియింపకుమీ
కలకంఠికంటఁ గన్నీ
రొలికిన సిరి యింట నుండ ♦ నొల్లదు సుమతీ. 37

టీ. సుమతీ, ఎప్పుడున్ = ఎప్పటికి - కులకాంతతోడన్ = భార్యతో - కలహింపకు = కలహము చేయకుము - వట్టితప్పున్ = లేని నేరమును, ఘటియింపకుమీ = మోపకుము - కలకంఠికంటన్ = స్త్రీయొక్క కంటి నుండి కన్నీరు = బాష్పములు - ఒలికినన్ = పడినట్లయిన - సిరి = లక్ష్మి - ఇంటన్ = ఇంటియందు - ఉండన్ = ఉండుటకు - ఒల్లదు = ఇష్టపడదు.

తా. ఎప్పుడును భార్యతో జగడమాడకుము. అందువలన ఆమె దుఃఖించి కన్నీరు పడినయెడల ఇంటియందు సంపద యుండదు.

క. కూరిమి గల దినములలో
నేరము లెన్నఁడును గలుగ ♦ నేరవు మఱి యా
కూరిమి విరసంబైనను
నేరములే తోఁచుచుండు ♦ నిక్కము సుమతీ. 38

టీ. సుమతీ, కూరిమి = స్నేహము - కలదినములలోన్ = ఉన్నటువంటి దినములయందు - నేరములు = తప్పులు - ఎన్నఁడున్ = ఎప్పుడును కలుగనేరవు = తోఁపవు; మఱి - ఆకూరిమి = ఆస్నేహము - విరసంబైనను = విరోధమైనను - నేరములే = తప్పులే - తోఁచుచుండున్ = కలుగుచుండును - నిక్కము = నిజము.

తా. చెలిమి గలనాఁడు తప్పు లెన్నఁడును గనఁబడవు. ఆచెలిమి విరోధమైన నొప్పులును తప్పుగానే తోఁచుచుండును.

క. కొంచెపు నరుసంగతిచే
నంచితముగఁ గీడువచ్చు ♦ నది యెట్లన్నన్
గించిత్తు నల్లి గఱచిన
మంచమునకుఁ బెట్లు వచ్చు ♦ మహిలో సుమతీ. 39

టీ. సుమతీ, మహిలోన్ = భూమియందు, కొంచెపునరుసంగతి చేసన్ = నీచుని స్నేహంబుచేత, అంచితముగన్ = ఒప్పునట్లుగా, కీడువచ్చున్ = చెరుపువచ్చును, అది-ఎట్లనన్ = ఏలాఁగనఁగా, కించిత్తునల్లి = చిన్ననల్లి, కఱచినన్ = కొఱికినయెడల, మంచమునకు, పెట్లు = దెబ్బలు, వచ్చున్ = కలుగును.

తా. చిన్ననల్లి కఱచినచో, ఏవిధముగా మంచమునకు దెబ్బలు కలుగునో, ఆరీతిగా అల్పునితో స్నేహము చేసినవారికి చెరుపుకలుగును.

క. కొక్కోకమెల్ల జదివిన
జక్కనివాఁడైన రాజ ♦ చంద్రుండైనన్
మిక్కిలి రొక్కము లీయక
చిక్కదురా వారకాంత ♦ సిద్ధము సుమతీ 40

టీ. సుమతీ, కొక్కోకము = రతిశాస్త్రము, ఎల్లన్ = అన్నింటిని, చదివినన్ = చదివినను, చక్కనివాఁడైనన్ = చూపరియైనను, రాజచంద్రుండైనను = రాజశ్రేష్ఠుండైనను మిక్కిలిరొక్కములు = ఎక్కువైనధనము ఈయక = ఇయ్యక చిక్కదు- వారకాంత = వేశ్య, సిద్ధము = నిశ్చయము.

తా. అధిక ధనము నిచ్చువానిని వేశ్య వలచునే కాని, రతిశాస్త్రజ్ఞుని, చూపరిని వలవదు.

క. కొఱగాని కొడుకు పుట్టినఁ
గొఱగామియె కాదు తండ్రి ♦ గుణముల జెఱచున్
జెఱకుతుద వెన్ను పుట్టినఁ
జెఱకున దీపెల్లఁ జెఱచు ♦ సిద్ధము సుమతీ. 41

టీ. సుమతీ, కొఱగాని కొడుకు = నిరర్థకుఁడయిన కుమారుఁడు పుట్టినన్ = జన్మించినయెడల, కొఱగామియె కాదు = నిష్ప్రయోగమే కాక

తండ్రి గుణములన్=తండ్రియొక్క గుణములను, (కూడ) చెఱుచున్=పాడుచేయును, చెఱుకుతుదన్=చెఱకుకొనయందు, వెన్ను=కంకి, పుట్టినన్=కలిగినయెడల, చెఱుకునన్=చెఱుకునందు, తీపు=తియ్యదనము, ఎల్లన్=అంతయును, చెఱుచున్=పోగొట్టును, సిద్ధము=(ఇది) నిజము.

తా. చెఱకుకొనయందు వెన్నుబుట్టినయట్లు ఆచెఱకునందలి తీపు నుకూడఁ బాడుచేయునో, అట్లు నిరర్థకుఁడయిన పుత్త్రుఁడు పుట్టి వాఁడు నిష్ప్రయోజకుఁడగుటయేకాక, తనతండ్రి గుణములనుగూడ చెఱుచును.

క. కోమలి విశ్వాసంబును
పాములతోఁ జెలిమి యన్య ♦ భామల వలపున్
వేముల తియ్యదనంబును
భూమీశుల నమ్మికలును ♦ బొంకుర సుమతీ. 42

టీ. సుమతీ, కోమలి=స్త్రీయొక్క, విశ్వాసంబును=చెలిమి యును పాములతోన్=సర్పములతో, చెలిమి=స్నేహమును, అన్యభామలవలపున్=పరస్త్రీల ప్రేమయును, వేములతియ్యదనంబును=వేపచెట్ల యొక్క తీపును, భూమీశుల నమ్మికలును=రాజులయొక్క విశ్వాసము లును, బొంకురా=అబద్ధముగదా.

తా. ఆఁడుదాని నమ్మకమును, పాముతోడ చెలిమియును, పర స్త్రీల ప్రేమయును, వేపచెట్టుయొక్క తీపును, రాజుల విశ్వాసమును అబద్ధములు.

క. గడన గలమగనిఁ జూచిన
నడుగడుగున మడుగు లిడుదు ♦ రతివలు దమలో
గడ నుడుగు మగనిఁ జూచిన
నడపీనుఁగు వచ్చె ననుచు ♦ నగుదురు సుమతీ. 43

టీ. సుమతీ, గడన=సంపాదనము, గల=కల్గిన, మగనిన్=పతిని, చూచినన్=చూచినయెడల, అడుగడుగునన్=ఒక్కొక్క అడుగునకు గ్రింద, (అనగా వెంట వెంటనే) మడుగులు=వస్త్రములును, (వేసి) ఇడుదురు=ఉంచుదురు, గడన=సంపాదనము, ఉడుగు మగనిన్=లేనిభర్తను చూచినన్=చూచినచో, నడపీనుఁగు=నడచునట్టి శవము. వచ్చెన్=వచ్చెను, అనుచు=అని చెప్పుచు, అతివలు=స్త్రీలు నగుదురు=నవ్వుదురు.

తా. స్త్రీలు సంపాదనము గలపతిని గాంచినయెడల, మిగుల శుశ్రూష చేయుదురు- సంపాదనము లేనిభర్తనుఁ జూచినయెడల నడచునట్టి శవము వచ్చెననుచు పరిహాసము చేయుదురు.

క. చింతింపకు కడచినపని
కింతులు వలతు రని నమ్మ ♦ కెంతయు మదిలో
నంతఃపురకాంతలతో
మంతనములు మాను మిదియె ♦ మతమూర సుమతీ 44

టీ. సుమతీ. కడచినపనికిన్=జరిగిపోయినకార్యమునకు, చింతింపకు=విచారముఁబొందకు, ఇంతులు=స్త్రీలు, వలతురు అని=ప్రేమింతురని, మదిని=మనస్సునందు, ఎంతయున్=ఎంతమాత్రమును, నమ్మకు=విశ్వసింపకుము, అంతఃపురకాంతలతోన్=రాణివాస స్త్రీలతో మంతనములు=రహస్యపుమాటలు, మానుము=విడువుము, ఇదియే=ఇదే, మతమూర=మతము గదా.

తా. జరిగిపోయిన పనికి విచారపడుట తగదు. స్త్రీలు ప్రేమింతురని ఇంచుకంతయు నమ్మకుము. రాణివాసస్త్రీలతో రహస్యాలోచనములు సలుపకుము.

క. చీమలు పెట్టినపుట్టలు
పాముల కిరవైనయట్లు ♦ పామరుఁడు దగఁ

హేమంబుఁ గూడఁబెట్టిన
భూమీశులపాలఁ జేరు ♦ భువిలో సుమతీ. 45

టీ. సుమతీ, భువిలో=భూమియందు, చీమలు=పిపీలికములు, పెట్టిన, పుట్టలు=వల్మీకములు, పాములకు=సర్పములకు, ఇరవు=తావు ఐనయట్లు=ఐనరీతిగా; పామరుఁడు=మూఢుఁడు, హేమంబున్=బంగారమును, కూడబెట్టిన=చేర్చిన, భూమీశులపాలన్=రాజులవశ, మున, చేరున్=చేరును.

తా. చీమలు పెట్టిన పుట్టలు సర్పములకు నెలవయినట్లు లోభి చేర్చిపెట్టిన ధనము రాజులపాలగును.

క. చుట్టములు గానివారలు
చుట్టములము నీ కటంచు ♦ సొంపు దలిర్పన్
నెట్టుకొని యాశ్రయింతురు
గట్టిగ ద్రవ్యంబు గలుగఁ ♦ గదరా సుమతీ. 46

టీ. సుమతీ, చుట్టములు గానివారలు=బంధువులు గానివారలు గట్టిగ, ద్రవ్యంబుగలుగన్=ధనము చేరఁగానే, చుట్టములము=బంధుగులము. నీకటంచు=నీకనుచు, సొంపు=సంతోషము, దలిర్పన్=ఒప్పునట్లుగా, నెట్టుకొని=బలాత్కారముగా, ఆశ్రయింతురు=అనుసరింతురు కదరా=కాదా.

తా. బంధువులు కానివారలు సయితము ధనముచేరినప్పుడు బలాత్కారముగా మేము నీకు బంధువులమని వచ్చి చేరుదురు.

క. చేతులకుఁ దొడవు దానము
భూతల నాథులకుఁ దొడవు ♦ బొంకమి ధరలో
నీతియె తొడ వెవ్వారికి
నాతికి మానంబు తొడవు ♦ నయముగ సుమతీ. 47

టీ. సుమతీ, చేతులకు=హస్తములకు, దానము=ఈవి, తొడవు=ఆభరణము, భూతలనాథులకున్=రాజులకు, బొంకమి=అబద్ధము చెప్పకుండుటయె, తొడవు=ఆభరణము, ధరలోన్=భూమియందు, ఎవ్వారికిన్=ఎట్టివారికిని, నీతియు=న్యాయమె, తొడవు=భూషణము, నాతికిన్=స్త్రీకి, మానంబు=పాతివ్రత్యమే, తొడవు=భూషణము.

తా. చేతులకు, దానమును, రాజులకు అసత్యమాడకుండుటయు, స్త్రీలకు పాతివ్రత్యమును న్యాయమే యెల్లవారికిని అభరణములు.

క. తడ వోర్వక యొడ లోర్వక
   కడువేగం బడిచిపడినఁ ♦ గార్యం బగునే
   తడ వోర్చిన నొడ లోర్చినఁ
   జెడిపోయిన కార్యమెల్లఁ ♦ జేకుఱు సుమతీ. 48

టీ. సుమతీ, తడవు=ఆలస్యమును, ఓర్వక=ఓర్వలేక, ఒడలోర్వక=శరీరశ్రమను ఓర్వక, కడువేగము=అతివేగముగా, అడిచిపడినన్=మిక్కిలిపడినయెడల, కార్యంబు=పని, అగునే=అగునా? తడవు=ఆలస్యమును, ఓర్చినన్=ఓర్చినయెడల, ఒడలోర్చిన=శరీరమునోర్చిన, చెడిపోయిన కార్యమెల్లన్=చెడిపోయిన కార్యమంతయును, చేకుఱున్=సమకూడును.

తా. ఆలస్యమునకును, దేహశ్రమకును సహింపక తొందరపడిన యెడల యేకార్యమును గానేరదు. ఆలస్యమును దేహప్రయాసమును ఓర్చుకొన్నయెడల చెడిపోయిన పనులన్నియు సమకూడివచ్చును.

క. తనకోపమె తనశత్రువు
   తనశాంతమె తనకురక్ష ♦ దయ చుట్టంబౌఁ
   తనసంతోషమె స్వర్గము
   తనదుఃఖమె నరక మండ్రు ♦ తథ్యముసుమతీ. 49

టీ. సుమతీ, తనకోపమె=తనక్రోధమే, తనశత్రువు=తనకు పగవాఁడు, తనశాంతమె=తనసమ్మదే, తనకురక్ష=తన్నురక్షించునట్టిదగును, దయ=కరుణ, చుట్టంబౌ=బంధువగును, తనసంతోషమె=తన కుతూహలమే, స్వర్గము=దేవలోకము, తనదుఃఖమె=తన చింతయే, నరకము=యమలోకము, అండ్రు=చెప్పుదురు, తథ్యము=నిజము.

తా. శత్రువువలె తనకోపమె తన్ను బాధించును. తనసమ్మదే తన్ను రక్షకునివలె కాపాడును. తనదయయే చుట్టమువలె ఆదరించును. తనసంతోషమే స్వర్గమువలె సుఖము నిచ్చును. తనచింతయే నరకమువలె వేధించును. (అని చెప్పుదురు.)

క. తనయూరి తపసితనమును
 దనపుత్త్రుని విద్యపెంపుఁ ♦ దన సతిరూపుం
 దన పెరటి చెట్టు మందును
 మనసున వర్ణింపరెట్టి ♦ మనుజులు సుమతీ. 50

టీ. సుమతీ, తనయూరి=తనగ్రామమందుండునట్టి, తపసితనమును=తాను జేయు తపోనిష్ఠను, తనపుత్త్రుని=తన కుమారునియొక్క, విద్యపెంపున్=విద్యాకౌశలమును, తనసతిరూపున్=తనభార్యయొక్క సౌందర్యమును, తన పెరటిచెట్టుమందును=తనతోటలోనుండునట్టి చెట్టు మందును, ఎట్టిమనుజులు=ఎటువంటివారు, ఐనను-మనసునన్=మనస్సునందు, వర్ణింపరు=మెచ్చుకొనరు.

తా. తనయూరిలో నొకఁడుచేయు తపస్సును, తనకుమారుని విద్యాధిక్యమును, తనభార్యయొక్క సౌందర్యమును తనతోటలోని ఔషధమును, యెట్టువంటి వారయినను కొనియాడరు.

క. తనకలిమి యింద్రభోగము
 తనలేమియె సర్వలోక ♦ దారిద్ర్యంబౌ

తనచావు జలప్రళయము
తనవలచినయదియె రంభ ♦ తథ్యము సుమతీ. 51

టీ. సుమతీ, తనకలిమి=తనభాగ్యము- ఇంద్రభోగము=దేవేంద్రునిపదవితో సమానమయినది- తనలేమియె=తనపేదరికమే- సర్వలోకదారిద్ర్యంబు=ప్రపంచమునకంతను లేమికి- తనచావు=తనమృతి- జలప్రళయము=యుగప్రళయము- తనవలచినయదియె=తాను ప్రేమించిన స్త్రీయే- రంభ=మిక్కిలి చక్కనిది, తథ్యము=నిజము.

తా. తనభాగ్యమే దేవేంద్రపదవిగాను- తనదరిద్రమే ప్రపంచమునకంతకుఁగలిగిన లేమిగాను- తనచావే యుగప్రళయముగాను తాను వలసిన స్త్రీయే మిక్కిలి (రంభతో సమానురాలు) చక్కనిదిగాను లోకులు తలంతురు.

క. తనవారు లేనిచోటను
జనవించుక లేనిచోట ♦ జగడముచోటన్
అనుమానమైనచోటను
మనుజునకును నిలువఁదగదు ♦ మహిలో సుమతీ. 52

టీ. సుమతీ, తనవారు=తనబంధువులు, లేనిచోటన్=లేనిచోట జనవు=మచ్చిక- ఇంచుకలేనిచోటన్=కొంచెమయినను లేనితావున- జగడముచోటన్=కలహము చేసెడి తావున- అనుమానము=సంశయము- ఐన చోటన్=అయిన తావున- మహిలోన్=భూమియందు- మనుజునకున్=మనుష్యునికి- నిలువఁదగదు=ఉండుట మంచిదికాదు.

తా. తన బంధువులు లేనితావునను- తనయందు విశ్వాసము లేని తావునను- జగడమాడెడు తావునను, తనపై సందేహమయిన తావునను, మనుష్యుడుండకూడదు.

క. తమలము సేయని నోరును
విమతులతోఁ జెలిమి చేసి వెతఁబడు తెలివిన్
గమలములు లేని కొలఁకును
హిమధాముఁడు లేని రాత్రి హీనము సుమతీ. 53

టీ. సుమతీ, తమలము సేయని నోరును = తాంబూలము వేసికొనని నోరును - విమతులతోన్ = బుద్ధిహీనులతో - చెలిమి చేసి = స్నేహము చేసి - వెతఁబడు తెలివిన్ = దుఃఖ మొందునట్టివాని వివేకమును, కమలములు = తామరపువ్వులు లేని కొలఁకును = లేనిసరస్సును - హిమధాముఁడు లేని రాత్రి = చంద్రుఁడు లేని రాత్రియును - హీనము = తక్కువైనది.

తా. తాంబూలము సేయనినోరును - బుద్ధిహీనులతో స్నేహము చేసి దుఃఖించువాని వివేకమును - తామరలేని చెఱువును చంద్రుఁడులేని రాత్రియు నీచములైనవి.

క. తల నుండు విషము ఫణికిని
వెలయంగాఁ దోఁక నుండు వృశ్చికమునకున్
దల తోఁక యనక యుండును
ఖలునకు నిలువెల్ల విషము గదరా సుమతీ. 54

టీ. సుమతీ, ఫణికిని = పామునకు విషము = విసము - తలనుండున్ = శిరస్సునందుండును - వెలయఁగాన్ = ఒప్పునట్లుగా - వృశ్చికమునకున్ = తేలునకు - తోఁకన్ = తోఁకయందు - ఉండున్ = ఉండును - తలతోఁక యనకన్ = తలతోఁక అను భేదములేక - ఖలునకున్ = దుర్జనునికి - నిలువెల్లన్ = శరీరమందంతయు, విషము = విసముండును - కదరా = కాదా

తా. శిరస్సునందు పామునకును - తోఁకయందు తేలునకును - విసముండునుగాని; దుష్టునకు తలతోఁకయనెడి భేదములేక దేహమందంతటను విషముండును.

క. తలపొడుగు ధనముఁ బోసిన
వెలయాలికి నిజము లేదు ♦ వివరింపంగాఁ
దల దడివి బాసఁ జేసిన
వెలయాలిని నమ్మరాదు ♦ వినురా సుమతీ. 55

టీ. సుమతీ, తలపొడుగు=శిరస్సు ప్రమాణము, ధనము=అర్థమును- పోసినను=కుమ్మరించినను- వెలయాలికి=వేశ్యకు- నిజము లేదు=సత్యము లేదు- వివరింపంగాన్=విస్తరించి చెప్పఁగా- తల=శిరస్సును- తడవి=తాఁకి బాస=ప్రమాణము- చేసినన్=చేసినప్పటికిని- వెలయాలిని=వేశ్యను; నమ్మరాదు=విశ్వసింపఁగూడదు.

తా. నిలువెత్తు ధనము క్రుమ్మరించినను వేశ్యకు సత్యము లేదు. తల మీఁద చేయినుంచి ప్రమాణము చేసినను వేశ్యను నమ్మరాదు.

క. తల మాసిన నొలు మాసిన
వలువలు మాసినను బ్రాణ ♦ వల్లభు నైనం
గులకాంతలైన రోఁతురు
తిలకింపఁగ భూమిలోన ♦ దిరముగ సుమతీ. 56

టీ. సుమతీ, తిలకింపఁగన్=అరసి చూడఁగా- భూమిలోనన్=పుడమియందు, తిరముగన్=స్థిరముగా- తల మాసినను=తల మురికియైనను ఒలు మాసినన్=శరీరము మురికియైనను- వలువలు మాసినను=వస్త్రములు మాసినను ప్రాణవల్లభునైనన్=మగనినైనను- కులకాంతలు=భార్యలు- ఐనన్=ఐనప్పటికిని- రోఁతురు=తిరస్కరింతురు.

తా. పుడమియందు తన ప్రాణనాయకునైనను తలయు- దేహము నువస్త్రములును మురికియైనయెడల భార్యలు సయితము తిరస్కరింతురు.

క. తానను భవింప నర్థము
   మానవపతిఁ జేరుఁ గొంత ♦ మఱి భూగత మౌఁ
   గానల నీఁగలుగూర్చిన
   తేనియ యొరుఁ జేరునట్లు తిరముగ సుమతీ. 57

టీ. సుమతీ, కానలన్ = అడవులయందు- ఈఁగలు = మక్షికములు- కూర్చిన = చేర్చినట్టి- తేనియ = తేనె- ఒరున్ = ఇతరునికి- చేరునట్లు = వశమైనట్లు, తాను- అనుభవింపని = ఉపయోగింపని- అర్థము = ధనము- తిరముగన్ = స్థిరముగా- మానవపతిన్ = రాజును- చేరున్ = చేరును. మఱి = మఱియును- కొంత భూగతమౌన్ = కొంతభూమి పాలగును.

తా. అడవియందు తేనెటీఁగలు కూడఁబెట్టిన తేనె, ఎట్లు పరులకు చెందునో. అట్లు తాను చేర్చిపెట్టిన ధన మనుభవింపనియెడల, అధనములో కొంత రాజు పాలగును, మఱికొంత భూమిపాలగును.

క. దగ్గఱఁ గొండెము సెప్పెడు
   ప్రెగ్గడపలుకులకు రాజు ♦ ప్రియుఁడై మఱి తా
   నెగ్గు ప్రజ కాచరించుట
   బొగ్గులకై కల్పతరువుఁ ♦ బొడుచుట సుమతీ. 58

టీ; సుమతీ, దగ్గఱన్ = సమీపమునందు, కొండెము = చాడీ, చెప్పెడు = చెప్పునట్టి, ప్రెగ్గడ = మంత్రియొక్క, పలుకులకున్ = మాటలకు, రాజు = భూపాలుడు, ప్రియుండై = ప్రేమగలవాఁడై, మఱియు, తాన్ = తాను, ప్రజకు = జనులకు, ఎగ్గు = కీడు, ఆచరించుట = చేయుట, బొగ్గులకై = అంగారములకై కల్పతరువున్ = కోరినధనములనిచ్చెడి దేవతావృక్షమును, బొడుచుట = నఱకుట.

తా. రాజు మంత్రి చెప్పునట్టిచాడీలకు ప్రియుఁడై విచారింపక జనులకు చెఱుపుచేయుటయనునది, కోరినఫలముల నిచ్చెడి దేవతావృక్షము ను బొగ్గులకుగాను నఱికివేయుటతో సమాన మగును.

క. ధనపతి సఖుఁడై యుండియు
నెనయంగా శివుఁడు భిక్ష ♦ మెత్తఁగ వలసెన్
దనవారి కెంత గలిగినఁ
దనభాగ్యమె తనకుఁ గాక ♦ తధ్యము సుమతీ. 59

టీ. సుమతీ, ధనపతి=ధనాధిపతియైన (కుబేరుఁడు) సఖుఁడై=చెలికాఁడై. ఉండియున్=ఉండియును, శివుఁడు=ఈశ్వరుఁడు, ఎనయంగాన్=ఒప్పునట్లుగా, భిక్షము=బిచ్చము, ఎత్తన్ కాన్=ఎత్తునట్లుగా,వలసెన్=సంభవించెను. తనవారికి=తనతో సంబంధించినవారికి, ఎంతగలిగినన్=ఎంతయుండినప్పటికిని, తనభాగ్యమె=తనయదృష్టమె, తనకుకాక=అట్లుకాక, తధ్యము=నిజము.

తా. ధనవంతుఁడైన కుబేరుఁడు, ఈశ్వరునికి చెలికాఁడైయుండియు, తాను బిచ్చమెత్తవలసి వచ్చెను, కాఁబట్టి తమవారి కెంత ధనముండినను, తమ యదృష్టము ప్రకారమే తమకు జరగును.

క. ధీరులకుఁ జేయు మేలది
సారం బగునారికేళ ♦ సలిలముభంగిన్
గౌరవమును మఱి మీఁదట
భూరిసుఖావహము నగును ♦ భువిలో సుమతీ. 60

టీ. సుమతీ, ధీరులకున్=వివేకులకు, చేయు మేలు=చేయునట్టి యుపకారము, అది=ఆ (మంచిమేలు) సారంబగు=మంచిరుచిగలుగు, నారికేళ=టెంకాయయొక్క, సలిలముభంగిన్=నీరురీతిగా, గౌరవమును=మర్యాదయును, మఱి=మఱియు, మీఁదటన్=తర్వాత,

భూరి=గొప్పదైన, సుఖావహము=సుఖమును కలిగించు నదియును, అగును.

తా. టెంకాయచెట్టునకు నీరుఁబోసినయెడల, ఏప్రకారము, అది తర్వాత మిక్కిలి రుచిగల జలమునిచ్చునో, అట్లు వివేకులకు చేసినసహాయము, పిమ్మట మర్యాదయును సుఖమును నిచ్చును.

క. నడవకుమీ తెరువొక్కటఁ
గుడువకుమీ శత్రునింటఁ • గూరిమితోడన్
ముడువకుమీ పరధనముల
నుడువకుమీ యొరులమనసు • నొవ్వఁగ సుమతీ. 61

టీ. సుమతీ, ఒక్కటఁగ=ఒంటరిగా, తెరువు=మార్గమునందు, నడవకుమీ=పోకుము, శత్రునింట=విరోధిని యింటియందు, కూరిమితోడన్=స్నేహముతో, కుడువకుమీ=భోజనము చేయకుము, పరధనములన్=ఇతరుల ద్రవ్యమును, ముడువకుమీ=మూటఁగట్టియుంచుకొనకుము. ఒరుల=ఇతరుల, మనసు=హృదయము, నొవ్వఁగన్=నొచ్చునట్లుగా, నుడువకుమీ=మాటలాడకుము.

తా. దారిని ఒంటరిగా నడచుటయు, విరోధునియింటఁ బ్రీతితో భోజనముచేయుటయు, నితరులధనము నుంచుకొనుటయు, నితరులమనస్సు నొచ్చునట్లు నడచుకొనుటయుఁ గూడదు.

క. నమ్మకు సుంకరి జూదరి
నమ్మకు మగసాలెవాని • నటువెలయాలిన్
నమ్మకు మంగడివానిని
నమ్మకుమీ వామహస్తు • నవనిని సుమతీ. 62

టీ. సుమతీ, సుంకరిన్=పన్నుతీయువానిని, జూదరిన్=జూదగానిని, అగసాలెవానిన్=కమసాలెవానిని, అటు=అట్లే, వెలయా

లిఁ=వేశ్యగ, అంగడివానిన్=సరకులమ్మువానిని, అవనిన్=భూమియందు, వామహస్తున్=ఎడమచేతిపనివానిని, నమ్మకుము=విశ్వసింపకుము.

తా. అప్పుతీయువానిని, జూదమాడువానిని కమసాలివానిని వేశ్యను సరకులమ్మువానిని, ఎడమచేతితోఁ బనిసేయువానిని నమ్మకూడదు.

క. నయమున బాలుం ద్రావరు
    భయమునను విషమ్మునైన ♦ భక్షింతురుగా
    నయ మెంత దోసకారియొ
    భయమే చూపంగవలయు ♦ బాగుగ సుమతీ. 63

టీ. సుమతీ, నయమునన్=మంచిమాటలచేత, పాలున్=పాలైనను, త్రాగరు=పానముసేయరు, భయమునను=భయపరచుటచేత, విషమున్=విషమును, ఐనన్=ఐనప్పటికిని, భక్షింతురు=మ్రింగుదురు గాన=కావున, నయము=మంచితనము, ఎంతదోసకారియో=ఎంత దోషమును చేయునదియో, భయమే=వెరపే, చూపన్ కన్ వలయున్=కనఁబఱుపవలయును.

తా. మంచిమాటలతోఁ జెప్పినయెడలఁ బాలును ద్రాగనివారు కూడ భయముచే విషమునైనను మ్రింగుదురు, కాఁబట్టి, మంచితనముతోఁ గాని పనులకు వెఱపే జూపవలయును.

క. నరపతులు మేర దప్పినఁ
    దిరమొప్పఁగ విధవ యింటఁ ♦ దీర్పరియైనన్
    గరణము వైదికుఁ డైనను
    మరణాంతక మౌనుగాని ♦ మానదు సుమతీ. 64

టీ. సుమతీ, నరపతులు=రాజులు, మేరన్=న్యాయమైయుక్తహద్దు, తప్పినన్=మీఱినను, తిరము ఒప్పన్ కన్=స్థిరముగా సెల్ల

కాలమును, విధవ=మగఁడులేనిది, ఇంటన్=గృహమునందు, తీర్పరి యైనన్=పెద్దతనము చేయునదియైనను కరణము=గ్రామలేఖకుఁడు, వైదికుఁడు=వేదవిహితకర్మలే చేయువాఁడు (అనఁగా లోకజ్ఞానము లేనివాఁడు) మరణాంతకము=ప్రాణముపోవునంతటి సంకటము, కానగాని మానదు=తప్పదు,

తా. రాజు న్యాయము యొక్క హద్దు దప్పినను, ఇంటియందు పెత్తనము చేయునది విధవయైనను, గ్రామకరణము వైదికుఁడైనను, ప్రాణముపోవునంతటి సంకటము సంభవించును.

క. నవరసభావాలంకృత
  కవితాగోష్ఠియును మధుర ♦ గానంబును దా
  నవివేకి కెంతఁ జెప్పినఁ
  జెవిటికి సంకూదినట్లు ♦ సిద్ధము సుమతీ. 65

టీ. సుమతీ, నవరసభావా లంకృత=శృంగారము మొదలగు తొమ్మిదిరసములచేతను, భావ=వానిభావములచేతను, అలంకృత=అలంకరింపఁబడిన, కవితాగోష్ఠియును=పండితసల్లాపములును మధుర గానంబును=మనోహరమైన గీతము, తాన్=తాను, అవివేకికిన్=తెలివిలేనివానికి, ఎంతజెప్పినన్=ఎంతజెప్పినను, చెవిటికిన్=చెవిటివానికి, సంకు=శంఖమును- ఊఁదినట్లు=పూరించినట్లు సిద్ధము=నిశ్చయము.

తా. శృంగారము, హాస్యము, కరుణము, వీరము, రౌద్రము, భయానకము, భీభత్సము, అద్భుతము, శాంతము, అను తొమ్మిది రసములచేతను, చక్కని భావములచేతను, అలంకరింపఁబడిన విద్వాంసుల సల్లాపములును మనోహరమైన సంగీతమును, తెలివిలేనివాని కెంతఁ దెలియఁ జేసినను చెవిటివానికి సంకూదినట్లు నిరర్థకమే యగును.

క. నవ్వకుమీ సభలోపల
  నవ్వకుమీ తల్లిదండ్రి ♦ నాథులతోడన్

నవ్వకుమీ పరసతితో
నవ్వకుమీ విప్రవరుల నయ ♦ మిది సుమతీ. 66

టీ. సుమతీ, సభలోపలన్ = సభయందు, తల్లి = జననితోడను, తండ్రి = జనకునితోడను, నాథులతోడన్ = యజమానునితోడను, పరసతితోన్ = ఇతరుని భార్యతోడను, విప్రవరులన్ = బ్రాహ్మణశ్రేష్ఠులను, నవ్వకుము = పరిహాసము చేయకుము. ఇది, నయము = నీతి.

తా. తల్లిదండ్రులతోడను, యజమానునితోడను, పరస్త్రీతోడను బ్రాహ్మణశ్రేష్ఠులతోడను సభయందు, పరిహాసము చేయరాదు.

క. నీరే ప్రాణాధారము
నోరే రసభరిత మైన ♦ నుడువుల కెల్లన్
నారే నరులకు రత్నము
చీరే శృంగార మండ్రు సిద్ధము సుమతీ. 67

టీ. సుమతీ, నీరే = జలమే, ప్రాణాధారము = ప్రాణమునకు ఆధారము, నోరే = వాక్కే, రసభరితము = రసవంతము, ఐననుడువులకున్ = అయినట్టిమాటలకు, ఎల్లన్ = అన్నిటికిని, ఆధారము = స్థానము, నరులకున్ = మనుష్యులకు, నారే = స్త్రీయే, రత్నము = రత్నవంటిది-మిక్కిలి అలంకారమైనది, చీరె = చీరయే, శృంగారము = అందము- అండ్రు = అని చెప్పుదురు, సిద్ధము = నిశ్చయము.

తా. నీరే సకలజీవములు బ్రతుకుటకు ఆధారము. నోరే రసవంతములైన మాటలకెల్ల మూలము. సర్వజనులకు స్త్రీయే రత్నమువలె శ్రేష్ఠవస్తువును అలంకారమునైనది. మేలైనసింగారము వస్త్రమే.

క. పగ వల దెవ్వరితోడను
వగవంగా వలదు లేమి ♦ వచ్చినపిదపం

తెగనాడ వలదు సభలను
నగుఁవకు మన సియ్యవలదు ♦ మహిలో సుమతీ. 68

టీ. సుమతీ, ఎవ్వరితోడను=ఎట్టివారితోడను, పగ=విరోధము, వలదు=కూడదు, లేమి=దరిద్రము, వచ్చినపిడపన్=వచ్చినపిమ్మట- వగవంగాన్=ఏడ్చుట, వలదు=కూడదు, సభలను=సభలయందు, తెగన్=ఖండితముగా, ఆడవలదు=మాటాడవలదు, మహిలోన్=భూమియందు మగువకున్=ఆడుదానికి, మనసు=మనస్సును, ఇయ్యవలదు=ఇయ్యగూడదు.

తా. ఎవ్వరితోఁగాని పగపెట్టుకొనుటయు, దారిద్ర్యము సంభవించినప్పుడు దుఃఖించుటయు, సభలో మోమోటములేక మాటలాడుటయు ఆఁడుదానికి మనసిచ్చుటయుఁగూడదు.

క. పతికడకుఁ దన్నుఁగూర్చిన
సతికడకును వేల్పుకడకు ♦ సద్గురుకడకున్
సుతుకడకు రిత్త చేతుల
మతిమంతులు చనరు నీతి ♦ మార్గము సుమతీ. 69

టీ. సుమతీ, పతికడకున్=ప్రభువుదగ్గఱకును, తన్నున్=తన్ను, కూర్చిన=ప్రేమించిన- సతికడకున్=భార్యదగ్గఱను- వేల్పుకడకున్=దేవునిదగ్గఱకును, సద్గురుకడకున్=యోగ్యుఁడైన గురువుదగ్గఱకును, సుతుకడకున్=పుత్రునిదగ్గఱకును- మతిమంతులు=బుద్ధిమంతులు రిత్తచేతులన్=వట్టిచేతులతో, చనరు=పోరు- (ఇది నీతి)

తా. తన యధిపతిని- తన్నుఁ బ్రేమించెడి యిల్లాలిని-దేవుని- గురుశ్రేష్ఠుని- కుమారుని- జూడఁబోవునపుడు వట్టిచేతులతోఁ బోవరాదు.

క. పని సేయునెడల దాసియు
ననుభవమున రంభ మంత్రి ♦ యాలోచనలం

తనభుక్తియెడలఁ దల్లియు
ననఁదగు కులకాంత యుండ ♦ నగురా సుమతీ. 70

టీ. సుమతీ, పని=గృహకృత్యము చేయునెడలన్=చేయునపుడు యందు, దాసియున్=పనికత్తెయును. అనుభవమునన్=భోగించునపుడు - రంభ=రంభయును, ఆలోచనలన్=ఆలోచనములకు. మంత్రి=ప్రధానియును, తనభుక్తియెడలను=తనభోజనసమయమందు-తల్లియున్=కన్నతల్లియును, అనన్=అనఁగా, అగుకులకాంత=తనభార్య, ఉండన్=ఉండవలెను, అగురా=తగునుగదా.

తా. భార్య తనకు పనులు సేయునపుడు పనికత్తెవలెను, తాను భోగించునపుడు రంభవలెను, తనకు ఆలోచనము చెప్పునపుడు మంత్రివలెను, తనకు భోజనము పెట్టునపుడు తల్లివలెను ఉండవలయును.

క. పరనారీసోదరుఁడై
పరధనముల కాసపడక ♦ పరులకుహితుఁడై
పరులు దనుఁ బొగడ నెగడియుఁ
బరు లలిగిన నలుగ నతఁడు ♦ పరముఁడు సుమతీ. 71

టీ. పరనారీసోదరుఁడై=ఇతర స్త్రీలకు తోఁబుట్టువానివలె నుండువాఁడై, పరధనములకున్=ఇతరుల ద్రవ్యమునకు, ఆసపడక=కోరక, పరులకు=ఇతరులకు, హితుఁడై=స్నేహితుఁడై, పరులు=ఇతరులు, తనున్ బొగడన్=తన్నుఁ గొనియాడఁగా, నెగడక=అంగీకరింపక, పరులు=ఇతరులు, అలిగినన్=కోపగించినప్పుడు, అలుగని=కోపగింపని, అతఁడు=అపురుషుఁడు, పరముఁడు=ఉత్తముఁడు.

తా. పరస్త్రీలకు సోదరునివంటివాఁడు, ఇతరుల ధనమున కాసపడనివాఁడును, ఇతరులకు మిత్రుఁడును, పరులు స్తుతిచేసినపుడు అంగీకరింపనివాఁడును, పరులు తన్నుఁ గోపించినపుడు తాను గోపింపక యుండువాఁడును ఉత్తముఁడు.

క. పరసతి కూటమిఁ గోరకు
  పరధనముల కాసపడకుఁ ♦ బరు నెంచకుమీ
  సరిగానిగోష్ఠి సేయకు
  సిరిచెడి చుట్టంబుకడకుఁ ♦ జేరకు సుమతీ. 72

టీ. పరసతి=ఇతరునిభార్యయొక్క, కూటమిఁ=పొందును, కోరకు=ఆశింపకుము, పరధనములకుఁ=ఇతరులయొక్క సొత్తులకు, ఆసపడకుము=అభిలషింపకుము, పరుని=ఇతరుని, ఎంచకుమీ=తలంపకుము, సరిగాని=తగని, గోష్ఠి=సాంగత్యము, సేయకుము=ఒనర్పకుము, సిరిచెడి=సంపదఁ బోఁగొట్టుకొని, చుట్టంబు కడకుఁ=బంధుగునొద్దకు, చేరకు=వెళ్లకు.

తా. పరస్త్రీకాసపడుటయు, పరవిత్తములకాసపడుటయు ఇతరుల (తప్పుల) నెంచుటయు, ధనమునశించినతరువాత బంధువులయొద్దకు వెళ్లుటయు, సాటిలేనివారితో స్నేహముచేయుటయుఁ దగనిపనులు.

క. పరసతులగోష్ఠి నుండిన
  పురుషుఁడు గాంగేయుఁడైన ♦ భువి నిందఁబడున్
  బరసతి సుశీల యైనను
  బరుసంగతి నున్న నింద పాలగు సుమతీ. 73

టీ. పరసతులగోష్ఠిన్=అన్యస్త్రీల చెలిమిని, ఉండిన=ఉండినట్టి, పురుషుఁడు=మగఁవాడు, గాంగేయుఁడైనఁ=భీష్మాచార్యుఁడైనను, భువిఁ=భూమియందు, నిందపడున్=అపకీర్తి నొందును, పరసతి=ఇతరునిభార్య, సుశీలయైనను=మంచిస్వభావము కలదియైనను, పరుసంగతిఁ=ఇతరుని సాంగత్యంబున, ఉన్నఁ=ఉండెనేని, నింద పాలగుఁ=అపకీర్తిపాలగును.

తా. బ్రహ్మచర్యవ్రతముఁ గలభీష్ముఁడైనప్పటికిని, అన్యస్త్రీలతో

నుండెనేని నిందఁ బొందును. ఎంత మంచినడవడికగల యుత్తమురాలైన
ను పరపురుషునింట నుండినయెడల అపకీర్తిని బొందును.

క. ఒరునాత్మఁదలంచుసతి విడు
మఱుమాటలు పలుకుసుతుల ♦ మన్నింపకుమీ
వెఱ పెఱుఁగనిభటు నేలకు
తరుచుగ సతి యింటికేగఁ ♦ దగదుర సుమతీ. 74

టీ. ఒరున్=ఇతరుని, ఆత్మ=మనస్సునందు, తలచు=కోరునట్టి
సతిన్=భార్యను, విడు=వదలుము. మఱుమాటలు=అడ్డుమాటలు,
పలుకు=పలుకునట్టి. సుతులన్=పుత్రులను, మన్నింపకుమీ=క్షమింప
కుము వెఱవు=భీతి, ఎఱుఁగని=తెలియని, భటున్=సేవకుని, ఏలకు
ము=పాలింపకుము, తరుచుగన్=మాటిమాటికి, సతియింటకేఁగన్=
భార్యయొక్క యింటికి వెళ్ళుట, తగదుర=సరిగాదురా.

తా. అన్యపురుషుని కోరెడి భార్యను విడువవలయును,ఎదిరించి
మాటలాడు కుమారులను కాపాడరాదు, భయపడని సేవకుని ఉంచి
కొనరాదు పలుమఱు భార్యయింటికిఁ పురుషుఁడు పోరాదు.

క. పరులకు నిష్టము సెప్పకు
పొరుగిండ్లకు బనులు లేక ♦ పోవకు మెపుడున్
బరుఁ గదిసినసతిఁ గవయకు
మెఱిఁగియుఁ బిరుసైనహయము ♦ నెక్కకు సుమతీ. 75

టీ. పరులకు=ఇతరులకు, ఇష్టము=సమ్మతము, చెప్పకుము.పొరు
గిండ్లకున్=ఇతరుల గృహములకు, పనులు లేక=కార్యములు లేక, పోవ
కుము=పోవలదు. ఎప్పుడున్=ఎల్లప్పుడును, పరుఁగదిసిన=ఇతరుని
పొందిన సతిన్=స్త్రీని, కవయకుము=పొందకుము. ఎఱిఁగియు=తెలిసి
యు, బిరుసైన=పొగరుబోతైన, హయమును=గుఱ్ఱమును, ఎక్కకు

ము=ఆరోహింపకుము.

తా. నీయభిప్రాయమును ఇతరులకు జెప్పకుము. పనులు లేక పొరుగిండ్లకుఁ బోవకుము. పరపురుషుని సాంగత్యము చేసిన భార్యను గూడకుము. మోటుదనము గలగుఱ్ఱము నెక్కకుము.

క. పర్వముల సతులఁ గవయకు
ముర్వీశ్వరుకరుణ నమ్మి • యుబ్బకు మదిలో
గర్వింప నాలిఁ బెంపకు
నిర్వాహము లేనిచోట • నిలువకు సుమతీ. 76

టీ. పర్వములన్=పంచపర్వములయందు, సతులన్=స్త్రీలను గవయకుము=పొందకుము. ఉర్వీశ్వరుకరుణన్=రాజాదయను-నమ్మి=విశ్వసించి-మదిలో=మనస్సున- ఉబ్బకుము, సంతోషింపకుము-గర్వింపన్=గర్వించునట్లు ఆలి=భార్యను, పెంపకు=పోషింపకు,- నిర్వాహము లేని చోటన్=బాగుపడలేనితావునందు-నిలువకు=ఉండకుము.

తా. పర్వములయందు స్త్రీలను పొందుటయును - ప్రభువుదయను నమ్మి సంతసిల్లుటయును-భార్యకు చనువిచ్చుటయును- సాగుదల లేనిచోట నుండుటయుఁ దగనిపనులు.

క. పలుదోమి సేయువిడియము
తలఁగడిగిననాఁటినిద్ర • తరుణులతోడన్
బొలయలుక నాఁటికూటమి
వెల యింతని చెప్పరాదు • వినురా సుమతీ. 77

టీ. పలుదోమి సేయువిడియము=పండ్లు తోముకొనిన వెంటనే వేసికొనినతాంబూలమును, తలఁగడిగిననాఁటినిద్ర=తలంటుకొనిననాఁటినిద్రయును-తరుణులతోడన్ స్త్రీలతో-పొలయలుక నాఁటికూటమి= ప్రణయకలహము నాఁటి పొందును, వెల ఇంత అని చెప్ప రాదు=విలువ

యొక్క మితిని చెప్పుటకు సాధ్యము కాదు.

తా. పండ్లుతోముకొనిన వెంటనే వేసికొనిన తాంబూలమును, గలంటుకొనిననాఁటి నిద్రయును, పాలయుండకనాటి హాంమను వెలలే నివి. అనగా (వెలయొక్క మితిచెప్పుటకు శక్యములేనివి) .

క. పాటెఱుఁగని పతికొలువును
గూటంబున కెఱుకపడని ♦ కోమలిరతియున్
జేటెత్తఁ జేయు చెలిమియు
నేటికి నెదురీఁదినట్లు ♦ లెన్నఁగ సుమతీ. 78

టీ. పాటు=చేసెడిపనియొక్క కష్టమును, ఎఱుఁగని పతి=తెలిసికోలేని యజమానునియొక్క, కొలువు=సేవకత్వమును, కూటంబునకున్=కూటికి ఎఱుకపడని=తెలియఁబడని, కోమలి=స్త్రీయొక్క, రతియున్=పొందును, చేటెత్తన్=మోమాటములేక, చేయు చెలిమియున్=చేయునట్టిస్నేహమును, ఏటికి=నదికి, ఎదురు=ఎదురుగా, ఈఁదిన ట్లు=ఈఁదినట్లుచుండునట్లు, కదరా=గాదా.

తా. సేవకుఁడు పడునట్టికష్టమును దెలిసికొనని ప్రభుయొక్క సేవయు, సాంగత్యము నందాసక్తిలేని స్త్రీపొందును - మోమాటములేక చేయునట్టివాని చెలిమియును - ఏటికి అభిముఖముగా నీఁదుటవలె కష్టమును గలిగించును.

క. పాలను గలసినజలమును
బాలవిధంబుననె యుండుఁ ♦ బరికింపంగాఁ
బాలచవిఁ జెఱుచుఁ గావున
బాలసుఁడగువానిపొందు ♦ వలదుర సుమతీ. 79

టీ. పాలను=క్షీరమును-కలసిన=చేరినట్టి-జలమును=నీరును-పాలవిధంబుననె=క్షీరము రీతిగానే, ఉండున్=ఉండును- పరికింపంగా

ఁ=శోధించి చూడఁగా - పాల=క్షీరముయొక్క - చవిన్=రుచిని - చెఱు
చున్=చెఱుచునట్లు, చేయును. కావునన్=కాఁబట్టి ఖలునకుండు=దుర్జనుం
డు - అగువాని=అయినవాని - పొందు=స్నేహము - వలదుర=కూడదురా.

తా. పాలలోఁగలసిననీరు పాలవలెనే యుండినను దాని రుచిని
బోఁగొట్టునట్లే - దుర్జనుని సహవాసము గుణాతిశయములను చెఱుచును.
కాఁబట్టి దుర్జనునితో స్నేహముకూడదు.

క. ఖలునకు నైనయాపద
జాలిం బడి తీర్పఁదగదు ♦ సర్వజ్ఞునకున్
దే లగ్నిఁబడఁగఁబట్టిన
మే లెఱుఁగునె మీఁటుఁగాక ♦ మేదిని సుమతీ. 80

టీ. ఖలునకున్=దుర్జనునికి, ఐన=కలిగిన - ఆపద=కీడు - జా
లిన్=విచారమును - పడి=పొంది - తీర్పన్=తొలఁగించుట - సర్వజ్ఞున
కున్= అన్నియును దెలిసినవానికిని, తగదు=కూడదు, - తేలు=వృశ్చిక
ము - అగ్నిన్=నిప్పునందు - పడఁగన్=పడఁగా, పట్టిన=పట్టుకొనిన -
వానిన్=కుట్టును - కాని=కాని, మేలున్=ఉపకారమును - ఎఱుఁ
గునె=ఎంచునా.

తా. తేలు నిప్పులోఁ బడునపుడు విచారమునొంది పట్టుకొన్న
యెడల అది అన్నియును దెలిసినవానిని సైతము మేలునెంచక కుట్టును.
దుర్జనునికి కీడు తటస్థించిన యెడల ఆకీడును తప్పించుటకు సహాయముఁ
జేసినచోఁగీడే గలుగును.

క. పిలువనిపనులకుఁ బోవుట
గలయని సతిరతియు రాజు ♦ గానని కొలువున్
బిలువని పేరంటంబును
వలవని చెలిమియును జేయ ♦ వలదుర సుమతీ. 81

టీ. పిలువని పనులకున్ = పిలువని కార్యములకు - పోవుట = వెళ్ళుట - కలయని సతిరతి = మనసు కలియని సతి - భార్యయొక్క రతి - కూడిక - రాజు గానని = పాలకుని - రాజు = భూపతి - కానని = చూడని - కొలువున్ = ఉద్యోగమును - పిలువని పేరంటంబును = పిలువబడని పెండ్లికి ... పోవుటయును - వలువని చెలిమియును = ప్రేమింపని స్నేహితుని - చేయవలదుర = చేయకూడదు.

తా. పిలువని కార్యములకుఁ బోవుటయు - మనసు కలియని దానితో సహవాసము చేయుటయు - రాజు చూడని ఉద్యోగము చేయుటయు - పిలువబడని పేరంటమునకు బోవుటయు - ప్రేమింపని స్నేహమును జేయఁదగదు.

క. పురికిని బ్రాణము కోమటి
వరికిని బ్రాణంబు నీరు ♦ వసుమతిలోనన్
గరికిని బ్రాణము తొండము
సిరికిని బ్రాణంబు మగువ ♦ సిద్ధము సుమతీ. 82

టీ. పురికిని = పట్టణమునకు - కోమటి = వైశ్యుఁడును - వరికిని = సస్యమునకు - నీరు = జలమును, వసుమతిలోనన్ = భూమియందు - కరికిని = ఏనుగునకు - తొండము = తుండమును - సిరికిని = సంపదకు - మగువ = స్త్రీయును - బ్రాణంబు = జీవము - సిద్ధము = నిశ్చయము.

తా. నగరమునకుఁ గోమటియును - వరిపయిరునకు నీరును. ఏనుఁగునకు తొండమును - ధనమునకు స్త్రీయును - ప్రాణమువంటి ముఖ్యవస్తువులు.

క. పులిపాలుఁ దెచ్చియిచ్చిన
నలవడఁగా గుండఁ గోసి ♦ యఱచే నిడినం
దలపొడుగు ధనముఁ బోసిన
వెలయాలికిఁ గూర్మి లేదు ♦ వినరా సుమతీ. 83

టీ. వెలయాలికిన్=భోగముదానికి-పులిపాలు=పెద్దపులిదొక్క పాలను-తెచ్చియిచ్చినన్=కొనివచ్చియిచ్చినను - అవనిన్ కొన్=ఒప్పునట్లుగా-గుండెన్=గుండెకాయను-కోసి=ఖండించి, అఱచేతన్=అఱచేతియందు-ఇడినన్=ఉంచినను - తలపొడుగు=తలపొడవుపర్యంతము-ధనము=ద్రవ్యమును-పోసినన్=ప్రేమించినను - కూర్మిలేదు=విశ్వాసములేదు.

తా. పులిపాలు దెచ్చి యిచ్చినప్పటికిని-గుండెకాయను గోసి యఱచేతిలో నుంచినప్పటికిని - నిలువంత ద్రవ్యముఁ బోసినప్పటికిని వేశ్యకు ప్రేమ ఉండదు.

క. పెట్టినదినములలోపల
నట్టడవులకైన వచ్చు ♦ నానార్థములున్
బెట్టనిదినములఁ గనకపు
గట్టెక్కిన నేమి లేదు ♦ గదరా సుమతీ. 84

టీ. పెట్టినదినములలోపలన్ = పూర్వజన్మమున చేసిన దానము యొక్క ఫలకాలమందు-నట్టడవులకైనన్ = అరణ్యమధ్యమునకైనను-నానార్థములున్=సకలపదార్థములును-వచ్చున్=కలుగును - పెట్టనిదినములన్=పూర్వజన్మమునందు ఈయని కాలములయందు - కనకపుగట్టున్=బంగారుపర్వతమును-ఎక్కినన్=ఎక్కినను-ఏమిలేదు=ఏమియు లభింపదు. కదరా=కాదా.

తా. పూర్వజన్మమునం దేవేళలో పరులకు దానము కావించితిమో ఆవేళలోకి అంతయు లభించును గాని-పెట్టని వేళలందు బంగారు కొండెక్కినను ఏదియు లభింపదు కదా.

క. పొరుగునఁ బగవాఁ డుండిన
నిరవొందఁగ వ్రాతకాఁడె ♦ యేలిక యైనన్

ధరఁ గాఁపు కొండె మైనను
గరణాలకు బ్రతుకు లేదు ♦ గదరా సుమతీ. 85

టీ. పొరుగునన్=ఇంటిప్రక్కన - పగవాఁడు=విరోధి-ఉండినన్=నివశించియుండినను-నరవాండ్రన్ కాన్=ఒప్పనట్లుగా-ఏలిక=పాలకుడు- ప్రాఁతకాఁడై=వ్రాయ నేర్చినవాఁడై- ఐనన్=ఐనను- ధరన్=భూమియందు- కాఁపు=పైరు పెట్టువాఁడు, కొండెమైనను=చాడీలు చెప్పువాఁడైనను- కరణములకు=గ్రామలేఖకులకు- బ్రతుకు=జీవనము, లేదు=కలుగదు- కదరా=కాదా.

తా. పొరుగున విరోధియుండినను పాలకుఁడు వ్రాయనేర్చినవాఁడైనను- రైతు చాడీచెప్పువాఁడైనను- గ్రామలేఖకులకు జీవనముండదు.

క. బంగారుఁ గుదువఁ బెట్టకు
సంగరముఁన బాఱిపోకు ♦ సరసుఁడవైనన్
అంగడి వెచ్చము లాడకు
వెంగలితోఁ జెలిమి వలదు ♦ వినురా సుమతీ 86

టీ. బంగారున్=బంగారమును; కుదువపెట్టకుము=అప్పునకు బదులుగానుంపకుము. సంగరమునన్=యుద్ధమునందు, పాఱిపోకుము=తిరిగిపోకుము,సరసుఁడవైనను=వివేకముగలవాఁడవగుదువేని- అంగడిన్=బజారునందు- వెచ్చములాడకుము=అప్పుతీయకుము, వెంగలితోన్=వెఱ్ఱివానితో, చెలిమి=స్నేహము- వలదు=కూడదు,వినురా=ఆలకింపురా

తా. బంగారు తాకట్టుపెట్టుటయు- యుద్ధమునందు తిరిగిపోవుటయు- అంగడియందు అప్పుదీయుటయు- వెఱ్ఱివానితో స్నేహముచేయుటయుఁ దగనివనులు.

క. బలవంతుఁడ నాకేమని
పలువురతో నిగ్రహించి ♦ పలుకుట మేలా

బలవంతమైనసర్పము
చలిచీమలచేతఁ జిక్కి ♦ చావదె సుమతీ. 87

టీ. బలవంతుఁడను=బలముగలవాఁడను, నాకు ఏమని=నాకేమి కొఱఁత యని, నిగ్రహించి=విరోధించి, పలుకుట=మాటలాడుట, మేలా=లగ్గా బలవంతము=బలముగలిగిన, ఐన సర్పము=ఐనట్టిపాము చలిచీమలచేతన్=చిన్నచీమలచేత చిక్కి=తగులుకొని, చావదె=మృతిఁబొందదా?

తా. బలముగల పాము అయినప్పటికి చలిచీమలచేతఁ జచ్చినట్లు బలముగలవాఁడు అనేకులతో విరోధించెనేని, వారిచే మడియును,

క. మండలపతి సముఖంబున
మెండైనప్రధాని లేక ♦ మెలఁగుట యెల్లన్
గొండంతమదపుటేనుఁగు
తొండము లేకుండినట్లు ♦ దోఁచుర సుమతీ. 88

టీ. మండలపతిముఖమునన్ = చక్రవర్తిసభయందు, మెండైనప్రధాని=సమర్థుఁడైన మంత్రి-లేక, మెలఁగుట=వర్తించుట-ఎల్లన్=అన్నియును-కొండంత మదపుటేనుఁగు=పర్వతాకారముగలిగిన మదముగల యేనుఁగు, తొండములేక=తుండము లేక-ఉండినట్లు-తోఁచుర=కనఁబడునురా.

తా. కొండంతయెత్తుగల ఏనుఁగ తుండములేనియెడల-ఎట్లునిరర్థకమగునో- అట్లే-మంత్రిలేనియెడల చక్రవర్తియైనను నిరర్థకుఁడగును.

క. మంత్రిగల వానిరాజ్యము
తంత్రము చెడకుండ నిలుచుఁ ♦ దఱుచుగ ధరలో
మంత్రివిహీనుని రాజ్యము
జంత్రపుఁ గీలూడినట్లు ♦ జరుగదు సుమతీ. 89

టీ. మంత్రిగలవాని రాజ్యము=ప్రధానిగలవాని రాచఱికము-తంత్రము=ఉపాయము-చెడకుండ=చెడిపోక, నిలుచును=ఉండును-తఱుచుగన్=విశేషముగ, ధరలోన్=భూమియందు-మంత్రిహీనుని రాజ్యము=ప్రధానిలేని రాజ్యము, యంత్రపుకీలు=యంత్రముయొక్క యిరుసు-ఊడినట్లు=విడిపోయినట్లు, జరుగదు=నడువదు.

తా. మంత్రిగల రాజుయొక్క ప్రభుత్వము, ఉపాయము చెడకుండ జరుగుచుండును. యంత్రముయొక్క కీలు ఊడినట్లు మంత్రిలేని రాజుయొక్క పాలనము జరుగ నేరదు.

క. మాటకుఁ బ్రాణము సత్యము
కోటకుఁ బ్రాణంబు సుభట ♦ కోటి ధరిత్రిన్
బోటికిఁ బ్రాణము మానము
చీటికిఁ బ్రాణంబు వ్రాలు ♦ సిద్ధము సుమతీ. 90

టీ. మాటకున్=పలుకునకు-సత్యము=నిజమును-కోటకున్=సాలమునకు - సుభటకోటి=మంచిసేనాసమూహమును, ధరిత్రిన్=భూమియందు-బోటికిన్=స్త్రీకి, మానము=లజ్జయు-చీటికిన్=జాబునకు-వ్రాలును-ప్రాణంబు=జీవము.

తా. మాటకునిజమును-కోటకు సేనాసమూహమును, స్త్రీకిమానమును జాబునకు వ్రాసినవాని చేవ్రాలును ప్రాణమువలె ముఖ్యమైనవి.

క. మానఘనుఁ డాత్మధృతి చెడి
హీనుం డగువాని నాశ్ర ♦ యించుటయెల్లన్
మానెడుజలములలోపల
నేనుఁగు మెయిదాఁచినట్లు ♦ లెఱుఁగుము సుమతీ. 9

టీ. మానఘనుఁడు=గొప్పమానముగలవాఁడు, ఆత్మన్=హృ

యమునందు-ధృతి=ధైర్యము-చెడి=తొలఁగి-హీనుండు అగువానిన్= అల్పుడు ఐనవానిని-ఆశ్రయించుట=కొలుచుట- ఎల్లన్=అంతయును- మానెడుజలములలోపలన్ కొంచెపునీళ్ళలోపల - ఏనుఁగు=గజము, మెయిన్ (తన) దేహమును, దాఁచినట్లు = మఱుఁగుపఱచినట్లు - ఎఱుఁగుము = తెలిసికొనుము.

తా. గౌరవహీనుఁడు అల్పు నాశ్రయించుట రవంత నీళ్ళలో ఏనుగు దేహమును మఱుఁగు పఱచినట్లుండును.

క. రాపొమ్మని పిలువని యా
భూపాలునిఁ గొల్వభుక్తి ♦ ముక్తులు గలవే
దీపంబు లేనియింటను
జేపుణికిళ్ళాడినట్లు ♦ సిద్ధము సుమతీ. 92

టీ రా=రమ్ము, పొమ్ము=అరుగుము, అని పిలువని=ఇట్లుపిలువని, భూపాలుని=రాజును, కొల్వఁగా=సేవింపఁగా, భుక్తి=జీవనమును, ముక్తి=మోక్షమును. కలవే=ఉన్నవా (లేవనుట) దీపంబు=దివ్వె. లేనియింటన్=లేనిగృహమునందు, చేపుణికిళ్ళు=చేతతడవులాటలు, ఆడినట్లు=ఆడినరీతిగానే, సిద్ధము=నిజము.

తా. దీపములేని గృహమునందు చేతతడవులాడినట్లు రమ్ము పొమ్మని యాదరణసేయని రాజువద్ద ఉద్యోగము సేయుటవలన భుక్తియును ముక్తియును గలుగవు.

క. రూపించి పలికి బొంకకు
ప్రాపగుచుట్టంబు నెగ్గు ♦ పలుకకు మదిలోఁ
గోపించు రాజుఁ గొల్వకు
పాపపుదేశంబు సొరకు ♦ పదిలము సుమతీ. 93

టీ. రూపించి=అగుపరచి-పలికి=చెప్పి-బొంకకుము=అబద్ధముఁ జెప్పకుము, ప్రాపు=ఆదరువు-అగు=అగునట్టి.చుట్టంబును=బంధుగుని నెగ్గుపలుకకు=కీడుఁజెప్పకుము-మదిలోన్=మనస్సునందు-కోపించు=క్రోధ

ముజూను, రాజా౯=రాజును, కొల్వకు=సేవింపకుము, పాతప్రదేశంబు=పాతులగు దుర్గారణ్యంబుదేశములను, సారకుము==ప్రవేశింపకుము, పదిలము=భద్రము

తా. పాతులుమూలమున రూపించినకరువారి అబద్ధము చెప్పుటయు ఆప్తబంధువులను దూరుటయు, కోపియగురాజును గొలుచుటయు, పాతులందు భూమికేగుటయు కూడని పనులు.

క. లావుగల వానికంటెను
  భావింపఁగ నీతిపరుఁడు ♦ బలవంతుండౌ
  గ్రావంబంతగజంబును
  మావటివాఁ డెక్కినట్లు ♦ మహిలో సుమతీ. 94

టీ. గ్రావంబంత=కొండంతటి, గజంబును=ఏనుగును, మావటివాఁడు=మావంతుఁడు, ఎక్కినట్లు=ఆరోహించినట్లు, మహిలోన్=భూమియందు, లావు=శరీరదార్ఢ్యము, కలవానికంటెను=కల్గినవానికంటెను భావింపఁగన్=ఆలోచింపగా, నీతిపరుడు=వివేకముకలవాడు, బలవంతుడు=బలముగలవాడు అగును

తా. పెద్దఏనుగును మావటివాడు ఎక్కినట్లు బలముగలవానికంటెను నీతిపరుడే బలవంతుఁడు.

క. వఱదైనచేను దున్నకు
  కఱవైనను బంధుజనుల ♦ కడ కేఁగకుమీ
  పరులకు మర్మము సెప్పకు
  పిఱికికి దళవాయితనము ♦ పెట్టకు సుమతీ. 95

టీ. వఱద=వెల్లువ, ఐనచేను=ఐనట్టిపొలమును, దున్నకు=నాగలితో ఛేదింపకుము, కఱవు=క్షామము, ఐనను=సంభవించినను, బంధు

జనులకడకు=చుట్టాలయొద్దకు, ఏగకుమీ=పోకుమీ, పరులకు=ఇతరులకు, మర్మము=రహస్యము, చెప్పకు=తెలియజేయకుము, పిఱికికి=భయముగలవానికి, దళవాయితనము=సేనాధిపతిత్వము, పెట్టకుము=ఉంచకుము.

తా. వెల్లువరైన చేలమును దున్నుటయు, దుర్భిక్షకాలమునందు బంధువులకడకేగుటయు, అన్యులకు రహస్యమును చెప్పుటయు, ధైర్యహీనునికి సేనానాయకత్వము నొసంగుటయు దగనిపనులు.

క. వరిపంట లేనియూరును
దొర యుండని యూరు తోడు ♦ దొరకని తెరువున్
ధరను బతి లేనిగృహమును
నరయంగా రుద్రభూమి ♦ యనఁదగు సుమతీ. 96

టీ. వరిపంట=వరిపైరు, లేనియూరును=లేనట్టిగ్రామమును, దొర=ప్రభువు, ఉండనియూరున్=లేనియూరున్, తోడు=సహాయము, దొరకని=లభింపని, తెరువున్=మార్గమును, ధరను=భూమియందు, పతి=యజమాని, లేనిగృహము=లేనట్టియిల్లును, అరయన్ గాన్=ఆలోచింపఁగా, రుద్రభూమి=వల్లకాడు, అనన్=అనుటకు, తగున్=ఒప్పును.

తా. వరిపంటలేనియూరును అధికారినియమింపని గ్రామమును, తోడుదొరకని బాటయును, యజమానుఁడులేని గృహమును వల్లకాటితో సమానము.

క. వినఁ దగు నెవ్వరు చెప్పిన
వినినంతనె వేగపడక ♦ వివరింపఁ దగున్
గని కల్ల నిజము తెలిసిన
మనుజుఁడె పో నీతిపరుఁడు ♦ మహిలో సుమతీ. 97

టీ. ఎవ్వరు చెప్పినను=ఎవ్వరు చెప్పినను, వినఁదగున్=ఆలింపవచ్చు, వినినంతనె=వినఁగానె, వేగపడక=తొందరపడక, వివరింపదగున్=ఆలోచింపవలయును, కని=చూచి, కల్ల=అబద్ధముగుటయు, నిజము=సత్యమనుటయు, తెలిసినమనుజుడె=తెలుసుకొనువాడె, నీతిపరుడు=న్యాయమెరిగినవాడు.

తా. ఎవ్వరేమి చెప్పినను, తొందరపడక నిజమిదియనియు, అబద్ధమిదియనియు తెలిసికొనువాడే, వివేకముగలవాడు.

క. వీడెము సేయనినోరును
నాడియు మఱి లేదటంచు ♦ నాడెడినోరున్
బాడంగ రానినోరును
బూడిద కిరవైన పాడు ♦ బొందర సుమతీ. 98

టీ. వీడెముసేయని=తాంబూలము వేసికొనని నోరును, అడియు=చెప్పియు, మఱిలేదు అటంచున్ ఆడెడినోరున్=పిమ్మట లేదని పలుకునట్టినోరును, పాడఁగన్=పాడుటకు, రాని=తెలియని, నోరును=వాక్కును, బూడిదకు, ఇరవు=ఉనికిపట్టు, ఐనపాడుబొందర=ఐనట్టి ప్రయోజనము లేనిగొయ్యరా.

తా. తాంబూలమును సేయనట్టియు, మాటచెప్పి పిమ్మట లేదనునట్టియు, సంగీతము పాడుటకు తెలియనట్టియు, అగునోరు బూడిదతోయునట్టి గుల్లము వంటిది.

క. వెలయాలివలనఁ గూరిమి
గలుగదు మఱిఁ గలిగెనేని ♦ కడతేఱదుగాఁ
బలువురు నడచెడు తెరువునఁ
బులు మొలవదు మొలిచెనేని ♦ పొదలదు సుమతీ. 99

టీ. పలువురు=అనేకులు, నడచెడు తెరువునన్=నడచుచున్న దారియందు, పులు=పచ్చిక మొలవదు=పుట్టదు, మొలిచె నేని=ఒకవేళ పుట్టినేని, పాదలదు=వర్ధిల్లదు, వెలయాలివలనన్=వేశ్యవలన, ప్రేమి=ప్రేమ, కలుగదు=పుట్టదు, మతి=బుద్ధియును, కలిగెనేని=ఒకవేళ కల్గినను కడతేఱదు=బహుకాలముండదు.

తా. అనేకులు నడచెడి మార్గమందు పచ్చిక మొలవనే మొలవదు. అట్లు మొలిచినను (నశించుపోవును) అట్లే వెలపొలతికి ప్రేమకలుగనే కలుగదు అట్లు కల్గినను స్థిరముగా నుండదు.

క. శుభముల నొందనిచదువును
నభినయమును రాగరసము ♦ నందనిపాటల్
గుభగుభలు లేనికూటమి
సభ మెచ్చనిమాట లెల్లఁ ♦ జప్పన సుమతీ. 100

టీ. శుభములన్=మంగళములను. ఒందని=చెందని, విద్యయును=చదువును, అభినయమును=అర్థానుసారముగా అవయవవిన్యాసమును, రాగరసమున్=సంగీతస్వారస్యమును, అందనిపాటల్=లేనిపాటలను, గుభగుభలు=సంతోషాశ్చర్యములను తెలియజేయు శబ్దములు, లేనికూటమి=లేనిసభయును, మెచ్చనిమాటలు=పదిమంది సంతోషింపని మాటలును, ఎల్లన్=ఇవియంతయు, చప్పన=సారములేనివి.

తా. మంచి పొందనటువంటి చదువును, అర్థము ననుసరించి అభినయమును రాగమునందలి స్వారస్యమును లేనట్టిపాటయును, ఆశ్చర్య సంతోషశబ్దములు లేనిసభయును, పదుగురు మెచ్చని మాటలును సారములేనివి.

క. సరసము విరసముకొఱకే
పరిపూర్ణ సుఖంబు లధిక ♦ బాధలకొఱకే

పెరుఁగుట విఱుగుటకొఱకే
ధరతగ్గుట హెచ్చుకొఱకె ♦ తథ్యము సుమతీ. 101

టీ, పరసము=పరిహాసము - విపరముకొఱకే=విరోధముకొఱకే, పరిపూర్ణసుఖంబులు=అపరిమితములైన సౌఖ్యములు - అధికబాధలకొఱకే=పెక్కుకష్టములకొఱకే-పెరుఁగుట=వృద్ధిఁబొందుట - విరుగుటకొఱకే=భగ్నమగుటకొఱకే. ధర=వెల-తగ్గుట=చౌకయగుట-హెచ్చుకొఱకే=అధికమగుటకొఱకే తథ్యము=నిజము.

తా. పరిహాసపు మాటలు విరోధమును గలిగించును. అపరిమితమైన సౌఖ్యములు పిదప చాలకష్టములను గలిగించును. అధికముగాఁ బెరుగు నది విఱిగిపోవును. వెలతక్కువయగుట అధికమగుటకును కారణమగును

క. మేలెంచని మాలిన్యుని
మాలను నగసాలెవాని ♦ మంగలి హితుగా
నేలిన నరపతిరాజ్యము
నేలఁ గలసిపోవుఁ గాని ♦ నెగడదు సుమతీ. 102

టీ. మేలు=ఉపకారము-ఎంచని=తలంపని-మాలిన్యుని=మలినమైన మనస్సుగలవానిని-మాలను=చండాలుని - అగసాలెవానిన్=కమసాలవానిని-మంగలిన్=క్షౌరకుని, హితుగాన్=స్నేహితులనుగా ఏలిన=పాలించుచట్టి, నరపతిరాజ్యము=రాజుయొక్కపాలనము-నేలఁ గలిసిపోవున్=నశించిపోవును. కాని నెగడదు=అభివృద్ధిఁబొందదు.

తా. మంచి కోరని హీనాత్ముని మాలవానిని, బత్తుని, మంగలిని స్నేహితులుగాఁ జేసికొని రాజ్యము నేలువానియొక్క రాజ్యము నశించిపోవును.

క. స్త్రీలయెడ వాదులాడకు
బాలురతోఁ జెలిమి చేసి ♦ భాషింపకుమీ

మేలైన గుణము విడువకు
మేలినపతి నిందసేయ ♦ కెన్నఁడు సుమతీ. 103

టీ. ఎన్నఁడున్=ఎప్పటికిని, స్త్రీలయెడన్=ఆడువారితో, వాదులాడకు=తర్కముచేయకుము, బాలురతోడన్=పిల్లకాయలతో, చెలిమిచేసి=స్నేహముచేసి, భాషింపకుమీ=మాటలాడకుమీ, మేలైనగుణమున్=మంచిగుణమును, విడువకుము=వదలకుము, ఏలినపతిన్=రక్షించిన యజమానుని నిందసేయకుము=దూషింపకుము.

తా. ఆఁడువారితో దర్కించుటయు, పసిపిల్లలతో చెలిమిచేసి మాటలాడుటయు, మంచిగుణమును విడుచుటయు, కాపాడినవారిని దూషించుటయు దగనిపనులు.

క. సిరిదా వచ్చిన వచ్చును
సలలితముగ నారికేళ ♦ సలిలముభంగిన్
సిరి దాఁబోయినఁ బోవును
గరిమ్రింగిన వెలగపండు ♦ కరణిని సుమతీ. 104

టీ. సలలితముగన్=రమ్యముగా-నారికేళసలిలము భంగిన్=టెంకాయలోని నీళ్లవలె, సిరి=సంపద, తాన్=తాను-వచ్చినన్=కలిగినను, వచ్చును=కలుగును. కరి మ్రింగిన వెలగపండు కరణిన్=ఏనుగు మ్రింగిన వెలగపండువలె, సిరి=సంపద. తాన్=అది, పోయినన్=పోయినను, పోవును=మాయమగును.

తా. కలిమివచ్చునప్పుడు టెంకాయయందు జలము వచ్చునట్లు ఎవరికినిఁ దెలియకవచ్చును. ఆసంపద నశించిపోవునప్పుడు ఏనుగుమ్రింగిన వెలగపండునకు లోపల నేమి యుండక పైపెంకుమాత్రముండునట్లు మాయమగును.

క. మది నొకని వలచి యుండఁగ
మదిచెడి యొక క్రూరవిటుఁడు ♦ మానక తిరుగున్

బోఁడి జిలుక పిల్లి పట్టినఁ
జదువునె యాపంజరమున ♦ జగతిని సుమతీ. 105

టీ. మనసున్=మనస్సునందు, ఒకనిన్=ఒకవిటుని. తలఁచుచుండఁగన్=కోరికొనుచుండఁగా. మది=వివేకము, చెడి=తప్పి, ఒక క్రూరవిటుఁడు=మతియొక క్రూరుఁడైనజారుఁడు మానక=వదలక, తిరుగన్=వెంట తిరుగుచుండును, చిలుక=చిలుకయొక్క పంజరమునందు, పిల్లి=మార్జాలము, పట్టినన్=తాకిన, ఆపంజరమునన్=అగూటియందు, చదువునె=మాటలాడునా,

తా. చిలుక పంజరములోనుండ పిల్లి చేరినపుడు మాటలాడనియ ట్లే ఒకజారుని కోరియున్న స్త్రీని మతియొకవిటకాఁడు ఎంతబతిమాలి నను వశ్యురాలు కానేరదు.

క. పుత్త్రోత్సాహము తండ్రికిఁ
బుత్త్రుఁడు జన్మించినపుడె ♦ పుట్టదు జనులా
పుత్త్రునిఁ గనుఁగొని పొగడఁగఁ
బుత్త్రోత్సాహంబు నాఁడు ♦ పొందుర సుమతీ. 106

టీ. తండ్రికిన్=జనకునికి, పుత్త్రుఁడు=కొమరుఁడు, జన్మించిన పుడె=పుట్టినపుడె, పుత్త్రోత్సాహము=కొమరుగన్న సంతోషము, పు ట్టదు=కలుగదు, జనులు=మనుష్యులు, పుత్త్రునిన్=కొమరుని, కనుఁ గొని=చూచి, పొగడఁగ=మెచ్చికొనఁగా, పుత్త్రోత్సాహంబు=కొడుకు వలని=సంతోషము, నాఁడు=అదినమునందు, పొందుర=పొం దునుగదా.

తా. తండ్రికిఁ గొడుకుపుట్టగానే సంతోషము కల్గదుగాని, కొమ రునిఁజూచి లోకులు మెచ్చునపుడు సంతోషముపుట్టును.

క. వేసరపుజాతి గాని
వీసముఁ దాఁ జేయనట్టి ♦ వెంగలిగానీ
దాసికొడుకైనఁగానీ
కాసులు గలవాఁడె రాజు ♦ గదరా సుమతీ 107

టీ. వేసరపుజాతి=సంకరజాతి, గాని=అయినప్పటికిని, వీసము=కొంచెమైనను, దాన్=దాను, చేయనట్టి=చేయనట్టి, వెంగలిగాని=పిచ్చివాఁడుగాని, దాసికొడుక=దాసికొడుకు, ఐనగానీ=అయినప్పటికిని కాసులుగలవాఁడె=ధనముగలవాఁడె. రాజు గదరా=రాజుగదా.

తా. సంకరజాతియందుఁ బుట్టినవాఁడైనను విద్యాహీనుఁడైనను దాసిపుత్రుఁడైనను ధనముఁగలవాడే ప్రభువు.

సమాప్తము.

శ్రీ, జగవతి ప్రింటింగువర్క్సు, రాజమండ్రి.

వైద్యగ్రంథములు.

అనుపానమంజరి	0	8	0
సర్వాయుర్వేదజీవనము	0	8	0
నాడీపరిజ్ఞానము	0	6	0
పానీయకల్పవల్లి	0	4	0
ధన్వంతరినిఘంటు	2	8	0
ధన్వంతరివిజయము	0	8	0
నేత్రదర్పణము	0	8	0
వైద్యామృతము	1	4	0
చికిత్సారత్నము	1	4	0
చికిత్సాసారము	2	8	0
సుశ్రుతశారీరము	2	8	0
బసవరాజీయము	7	0	0
వశిష్టపరీక్షము	1	8	0
వ్యాసపరీక్షము	1	8	0
అగస్త్యపరీక్షము	1	8	0
వైద్యసారతరంగిణి	0	8	0
ఆయుర్వేదసారసంగ్రహం	0-8-0		
వైద్యశతశ్లోకి	0	6	0
రసప్రదీపిక టీకాతాత్పర్యసహితము	0	12	0
దంతశోధిని	0	6	0
వ్రణచికిత్స	0	8	0
కలరా	0	8	0
అంటువ్యాధులు	0	12	0
చలిజ్వరము	0	8	0
వైద్యప్రస్తారము	0	8	0
యూనానివైద్యం	0	12	0
స్త్రీశాస్త్రము	1	4	0
సుఖరోగచికిత్సారత్నము	0	12	0
చింతామణి 2 భాగములు	10	0	0
వాగ్భటము మొదటిభాగం సూత్రస్థానము	6	0	0
శార్ఙ్గధరసంహిత	3	12	0
మదనినిఘంటు	0	8	0
ఇంగ్లీషువైద్యచింతామణి	4	0	0
ఇంగ్లీషు ఔషధగుణదీపిక	3	0	0
వస్తుగుణదీపిక 5 భాగములు	6	0	0
సర్వౌషధగుణకల్పము	2	8	0

మూలాటి సత్యనారాయణమూర్తి, ఆంధ్రాబుక్కుడిపో, రాజమండ్రి.

ఆంధ్ర నాటకములు.

చిత్రనళీయము, బళ్లారి	1	8	0
[illegible]సారంగధర	1	8	0
ప్రహ్లాద డిటో	1	4	0
ప్రమీలార్జునీయము	1	4	0
సావిత్రీచిత్రాశ్వము	1	4	0
పాదుకాపట్టాభిషేకం	1	8	0
బృహన్నల	1	4	0
సంగీతమాలతీమాధవము	1	0	0
సావిత్రి నాటకము	1	0	0
[illegible]	0	14	0
భక్త రామదాసు	1	4	0
భక్త కబీరు	1	4	0
ద్రౌపదీమానసంరక్షణము	0	12	0
సంగీతనవనాటక ప్రకృతి			
చక్ర[illegible]నందనము డిటో	0	10	0
సంగీతశ్రీకృష్ణతులాభార			
ము ప్రకృతి	0	12	0
ఉషాపరిణయము డిటో	0	8	0
[illegible] డిటో	0	8	0
[illegible]చంద్రహాస డిటో	0	8	0
గయోపాఖ్యానము డిటో	0	8	0
[illegible]	1	0	0
[illegible]	1	0	0
[illegible]	0	8	0
[illegible]	1	0	0
ఆంధ్రనాటక[illegible]			
[illegible]భాగము	0	12	0
[illegible]భాగము	0	[illegible]	[illegible]

చింతామణి [illegible]	1	2	0
పద్మవ్యూహము డిటో	1	0	0
పాదుకాపట్టాభిషేకం	0	12	0
[illegible]	0	12	0
సారంగధర డిటో	0	12	0
లీలావతి డిటో	0	8	0
[illegible]	0	8	0
సంగీతచంద్రకాంత[illegible]			
సాంఖ్య[illegible] డిటో	0	10	0
సంగీత శ్రీ[illegible]			
[illegible] డిటో	0	10	0
మాలతీమాల [illegible]	0	12	0
[illegible] డిటో	0	8	0
[illegible] డిటో	1	0	0
[illegible]	0	12	0
డిటో [illegible] భాగము	0	12	0
సంపూర్ణరామాయణము	1	4	0
సంపూర్ణ[illegible]	1	4	0
సంపూర్ణభారతము	1	4	0
[illegible]	1	4	0
[illegible]	0	12	0
[illegible]	0	8	0
[illegible]చంద్రిక	0	8	0
సంగీత[illegible]	0	12	0
[illegible]	1	10	0
[illegible]	1	0	0
[illegible]	0	12	0
[illegible]	[illegible]	[illegible]	[illegible]

13697